

వన భోజనాలకు వేళాయె..

- ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ
- కార్తీక మాసంలో ఇదో సత్సంప్రదాయం
- ఉసిరి చెట్టు కింద భోజనంతో ఎంతో ప్రయోజనం
- ఆధునిక యుగంలోనూ కొనసాగుతున్న విధానం



- 8లో

నీటి సంఘాల ఎన్నికలు వాయిదా

21వ తేదీకి బదులు 23న నిర్వహించే అవకాశం

- శాసనసభ సమావేశాల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం

అనకాపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాసనసభ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 21న జరగాల్సిన నీటి సంఘాల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి. శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తరువాత 23వ తేదీన నీటి సంఘాల ఎన్నికలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. జిల్లాలో నీటి సంఘం ఎన్నికల నిర్వహణకు గత నెల 21వ తేదీన జిల్ల కలెక్టర్ విజయకృష్ణన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. నవంబరు 29వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగించాలి. జిల్లాలో తొలి దశ ఎన్నికలను ఈ నెల 21న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే తాజాగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండడంతో నీటి సంఘాల ఎన్నికలను రెండు రోజుల పాటు వాయిదా వేసినట్టు అధికారులు చెబుతున్నారు. ఓటరు జాబితాలను సిద్ధం చేశామని, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహిస్తామని జిల్లా నీటి పారుదల శాఖ అధికారి త్రినాథం తెలిపారు.

అనకాపల్లిలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ రేపు

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గౌరీ గ్రంథాలయంలో ఈ నెల 16న కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎన్‌వైకే జిల్లా యువ అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. సైన్స్ మేళా, యువ రచయితల పద్యాలు, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, సాంస్కృతిక, సంప్రదాయ ప్రదర్శన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు 15 నుంచి 29 ఏళ్ల వయసు గల వారు అర్హులన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

ధనార్జనే యాజమాన్యాల ధ్యేయం

- వైద్య, ఆరోగ్య శాఖ అనుమతులు లేకుండానే వైద్యశాలలు, ల్యాబ్‌లు ఏర్పాటు
- క్లినిక్‌ల మాటున పెద్ద ఆస్పత్రులు నిర్వహణ
- జ్వరంతో వెళితే...పలురకాల రక్తపరీక్షలు
- అడ్డగోలుగా ఫీజులు వసూలు
- కొరవడిన వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ



అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి ఎదుట ప్రైవేటు రక్త నమూనా సేకరణ కేంద్రం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వైద్యం పక్కా వ్యాపారంగా మారిపోయింది. ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగులను ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తున్నాయి. మారుమూల గ్రామీణ ప్రాంతాల నుంచి వైద్యం కోసం వచ్చేవారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, చిన్నపాటి రోగానికి కూడా పలు రకాల వైద్య పరీక్షలు చేయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రులు అందుబాటులో ఉన్నప్పటికీ అధిక శాతం మంది రోగులు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందేందుకు మొగ్గు చూపుతుంటారు. ఇదే ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులకు కలిసొస్తున్నది. కొంతమంది వైద్య నిపుణులు ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు ఆస్పత్రులను నడుపుతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో అనుమతి పొందిన ప్రైవేటు ప్రైవేటు ఆస్పత్రులు 149, రక్త పరీక్షల లేబొరేటరీలు 69 ఉన్నాయి. కానీ అనకాపల్లితోపాటు నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట, ఎలమంచిలి, అచ్యుతాపురం, తదితర ప్రాంతాల్లో అనుమతులు లేకుండానే ఆస్పత్రులు నడుపుతున్నారు. జిల్లా వ్యాపంగా వైద్య, ఆరోగ్య శాఖ అనుమతులు లేకుండా 350కి పైగా ఆస్పత్రులు నిర్వహిస్తున్నట్టుసమాచారం. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ప్రభుత్వ అనుమతులు వున్న ఆస్పత్రులు 20 లోపే ఉండగా, క్లినిక్‌లుగా రిజిస్టర్ చేసుకొని అనుమతి లేకుండా పెద్ద ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. ఇటువంటివి అనకాపల్లి పట్టణంలో 50 వరకు వున్నట్టు తెలిసింది.

రక్తపరీక్షల పేరుతో దోపిడీ

జ్వర బాధితులు వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే రక్త పరీక్షల పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. ఆస్పత్రులకు అనుబంధంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకోవాలంటే ప్రత్యేకంగా అనుమతులు పొందాలి. కానీ చాలా ఆస్పత్రులు ఎటువంటి అనుమతుఉలు లేకుండానే ల్యాబ్‌లు నిర్వహిస్తున్నారు. సాధారణ జ్వరం అయినప్పటికీ రక్త పరీక్షలతోపాటు అవసరం లేకపోయినా ఆస్పత్రులకు అనుబంధంగా ఉండే లేబొరేటరీల్లో స్కానింగ్, ఎక్స్‌రే, ఈసీజీ వంటివి చేయించుకోవాలని ప్రిస్క్రిప్షన్ రాస్తున్నారు. ఈ పరీక్షలకు రూ.వందలు, రూ.వేలల్లో ఫీజులు దండుకుంటున్నారు. ఇక ప్రైవేటు ల్యాబ్‌ల నిర్వాహకులు ప్రభుత్వ ఆస్పత్రులకు సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండానే కలెక్షన్ సెంటర్ల పేరుతో ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అనకాపల్లిలో ఎన్టీఆర్ ఆస్పత్రి పరిసరాల్లో నాలుగు రక్త నమూనా సేకరణ కేంద్రాలు సెంటర్లు వెలశాయి.



అనకాపల్లిలో వాణిజ్య సముదాయాల్లో నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు

దగ్గు, జలుబు తప్ప.. ఇతర వ్యాధులతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే రక్త, మూత్ర పరీక్షలు చేయించడం పరిపాటిగా మారింది. వైరల్ జ్వరంతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి.. రక్తంలో ప్లేట్‌లెట్స్ (రక్త కణాలు) పడిపోయాయని చెబుతున్నారు. జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రికి వెళితే.. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు ఎక్కువగా సోకుతున్నాయంటూ రోగులను భయభ్రాంతులకు గురి చేసి, ఆయా వైద్య పరీక్షలు చేయించుకునేలా రోగులపై మానసికంగా ఒత్తిడి పెంచుతున్నారు.

ల్యాబ్‌లు, ఆస్పత్రుల్లో కానరాని ఫీజుల పట్టిక

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లలో ఏ పరీక్షకు ఎంత ఫీజు తీసుకోవాలన్నది ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల వివరాల పట్టికను అందరికీ కనిపించేలా ఏర్పాటు చేయాలి. కానీ జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినికల్ ల్యాబ్‌లలో ఎక్కడా ఫీజు వివరాల పట్టికలు కనిపించవు. పైగా ఒక్కో రకం వైద్యానికి ఒక్కో ప్యాకేజీని నిర్ణయించి రోగుల నుంచి భారీగా డబ్బులు దండుకుంటున్నారు. ఇటీవల అనకాపల్లి మండలం సత్యనారాయణపురానికి చెందిన ఒక వ్యక్తి వైరల్ జ్వరంతో బాధపడుతూ వైద్యం కోసం పట్టణంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లారు. రక్తపరీక్షలు నిర్వహించిన వైద్యులు.. ప్లేట్‌లెట్‌లు బాగా పడిపోయాయంటూ భయాందోళనకు గురిచేసి నాలుగు రోజులు ఇన్‌పేషెంట్‌గా ఆస్పత్రిలో వుంచారు. చివరకు రూ.45 వేల బిల్లు చేతిలో పెట్టారు. ఇటువంటి దోపిడీలు ప్రైవేటు ఆస్పత్రుల్లో ... మిగతా 8వ పేజీలో



చోడవరంలో వెలుగు కార్యాలయం

వెలుగు సిబ్బందిపై వేటు?

- డ్వాక్రా సంఘాల నిధులు స్వాహా వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు
- రెండు రోజూ కొనసాగిన విచారణ

చోడవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): **మండలంలోని సింహాద్రిపురం పంచాయతీలో డ్వాక్రా సభ్యుల రుణాల సొమ్మును స్వాహా చేసిన వారిపై డీఆర్‌డీఏ (వెలుగు) అధికారులు విచారణను కొనసాగిస్తున్నారు. బుధవారం సింహాద్రిపురం, పాతిక గ్రామాల్లో విచారణ చేపట్టిన డీఆర్‌డీఏ అధికారులు గురువారం కూడా ఆయా గ్రామాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులను విచారించారు. ఎంత మేర నిధులు పక్కదారి పట్టాయన్నదానిపై వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.**

చోడవరం మండలం సింహాద్రిపురం పంచాయతీ వెలుగు వీవోఏ ఒకరు సింహాద్రిపురం, పాతిక గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళల పేరుతో సుమారు రూ.15 లక్షల రుణం మంజూరు చేయించి, ఆ సొమ్మును వేరే ఖాతాలకు మళ్లించుకున్నారు. ఇంకా పలు డ్వాక్రా సంఘాలు రుణ బకాయిల చెల్లింపు కోసం ఇచ్చిన డబ్బులను పక్కదారి పట్టించారు. ఈ విషయాన్ని ఒకింత ఆలస్యంగా గుర్తించిన సదరు డ్వాక్రా సంఘాల సభ్యులు.. సంబంధిత వీవోఏపై అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించి వెలుగు అధికారులు.. డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ డైసీని విచారణ అధికారిగా నియమించారు. ఆమె బుధవారం ఇక్కడకు వచ్చి వివరాలు సేకరించారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్టు చెప్పారు.

సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

రుణాల సొమ్ము స్వాహా వ్యవహారంలో బాధ్యులైన సిబ్బందిపై డీఆర్‌డీఏ అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది. డ్వాక్రా సంఘాల నిధులు గోల్‌మాల్‌పై సంబంధిత సీసీ, ఆపై అధికారులు పట్టించుకోకపోవడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నట్టు సమాచారం. డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ ఇచ్చిన నివేదిక మేరకు వెలుగు సిబ్బందిపై ఒకటి, రెండు రోజుల్లో క్రమశిక్షణ చర్యలు చేపట్టనున్నట్టు తెలిసింది. ఇదిలా వుండగా, రుణాల సొమ్ము స్వాహా చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతోపాటు తమ డబ్బులను తిరిగి ఇప్పించాలని ఆయా డ్వాక్రా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

వాటర్ ట్యాంకులు శిథిలం

పెచ్చులు ఊడిపోయి.. బయటకు కనిపిస్తున్న ఇనుప ఊచలు

- బలహీనంగా మారిన పిల్లర్లు
- ఎలమంచిలి వాసులకు పొంచి ఉన్న ముప్పు
- ట్యాంకులను నిరర్థకంగా మార్చని అధికారులు



22వ వార్డు వెంకటాపురంలో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంకు

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): **మునిసిపాలిటీలో దశాబ్దాల క్రితం నిర్మించిన పలు తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలిపోతాయో అన్నట్టుగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో పట్టణంలో పలు ట్యాంకుల నాణ్యత, సామర్థ్యాన్ని పరీక్షించిన అధికారులు.. కొన్ని ట్యాంకులు వినియోగించడానికి వీలుకాని పరిస్థితిలో వున్నాయని ఉన్నతాధికారులకు నివేదించారు. కానీ కొత్త ట్యాంకుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో శిథిలావస్థకు చేరిన ట్యాంకులనే వినియోగిస్తున్నారు.**

మునిసిపాలిటీలోని 22వ వార్డు వెంకటాపురంలో సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం 60 వేల లీటర్ల సామర్థ్యంతో తాగునీటి ట్యాంకు నిర్మించారు. ఎలమంచిలి అప్పట్లో మేజర్ పంచాయతీగా వుండడంతో ట్యాంకు నిర్మాణాన్ని పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టారు. అయితే నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడంతో కొంతకాలానికే ప్లాస్టరింగ్ పెచ్చులు ఊడిపోవడం మొదలైంది. క్రమేణా పెచ్చులతోపాటు కాంక్రీట్ కూడా రాలడం ప్రారంభమైంది. ముఖ్యంగా ట్యాంకు అడుగు భాగం, పిల్లర్లు పలుచోట్ల పెచ్చులు ఊడిపోయి ఇనుప ఊచలు కనిపిస్తున్నారు. దీంతో ట్యాంకు ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకర స్థితిలో వున్న ఈ ట్యాంకుకు సమీపంలోనే పిల్లలు ఆడుకుంటూ వుంటారు. ఈ ట్యాంకు చెంతనే మరో చిన్నపాటి తాగునీటి ట్యాంకు ఉండడంతో స్థానికులు ఇక్కడ నీరు పట్టుకుంటుంటారు. శిథిలావస్థకు చేరిన ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీటి పంపింగ్‌ను ఆపేయడమే కాకుండా వెంటనే దానిని కూల్చివేయాలి. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

కాగా మునిసిపాలిటీ ఐదో వార్డులోని మంత్రిపాలెం కాలనీ వద్ద ఉన్న తాగునీటి మినీ ట్యాంకు కూడా శిథిలావస్థకు చేరి నీరు వృధాగా పోతున్నది. కొక్కిరాపల్లి వార్డులోని తాగునీటి ట్యాంకు సైతం ఇదే స్థితికి చేరింది. మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు వెంటనే ఆయా తాగునీటి ట్యాంకులకు మరమ్మతులు చేయాలని, లేదంటే కూల్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.



ఐదో వార్డు మంత్రిపాలెంలో మరమ్మతులకు గురై లీకవుతున్న తాగునీటి ట్యాంకు




క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ

సైబర్ నేరగాళ్లు పంపే ఏపీకే ఫైళ్లు ఓపెన్ చేస్తే అంతే సంగతులు

- రోజుకో కొత్త తరహాలో సైబర్ మోసం
- అప్రమత్తం చేస్తున్న ట్రాయ్

నక్కపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వ ప్రైవేటు రంగ సంస్థలు అత్యున్నత టెక్నాలజీని అమలుచేస్తుండగా, సైబర్ నేరగాళ్లు అంతకుమించిన టెక్నాలజీని వినియోగిస్తూ ఒక క్లిక్‌తో అమాయక ప్రజల సొమ్మును కాజేస్తున్నారు. నగదు రహిత లావాదేవీలకు ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం.. ప్రజల సొమ్ముకు తగిన భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.**

నగదు రహిత లావాదేవీలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో ఇప్పుడు మారుమూల గ్రామాల్లో సైతం మొబైల్ ఆధారంగా నగదు చెల్లింపులు జరుపుతున్నారు. నగదు రహిత లావాదేవీలకు విద్యావంతులతోపాటు సామాన్య ప్రజలు కూడా అలవాటుపడిపోయారు. పది రూపాయల విలువ చేసే వస్తువును కొనుగోలు చేసినా.. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి డిజిటల్ ప్లాట్‌ఫారాల ద్వారా చెల్లిస్తున్నారు. వీధిలోని చిన్నపాటి దుకాణంలో కూడా క్యూఆర్ కోడ్‌తో స్కానర్లు కనిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో నగదు రహిత లావాదేవీలు విజయవంతంగా సాగుతున్నప్పటికీ, సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజల సొమ్ముకు భద్రత లేకుండా పోతున్నది. సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో జనం సొమ్ములు తస్కరిస్తున్నారు. ఏటీఎం కార్డు పిన్, బ్యాంకు ఖాతాలు వంటి వివరాలు చెప్పకుండానే, క్షణాల్లో బ్యాంకు ఖాతాల్లో నుంచి డబ్బును కొల్లగొడుతున్నారు. అనేక మంది బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లు అత్యాధునిక టెక్నాలజీతో కొల్లగొడుతున్నారు.



పీఎం కిసాన్ యోజన పేరుతో సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసిన నంబరుతో పంపిన ఏపీకే ఫైల్

ఏపీకే ఫైళ్లతో ప్రమాదం !

కొందరు అపరిచిత వ్యక్తులు పంపే వాట్సాప్ సందేశాలు, ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేస్తే నిమిషాల్లో డబ్బు లాగేస్తున్నారు. సైబర్ నేరగాళ్లు ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ లేదా ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైళ్లను వాట్సాప్ ద్వారా పంపుతున్నారు. వీటిని ఓపెన్ చేసి, ఓకే అని క్లిక్ చేస్తే.. సంబంధిత వ్యక్తుల ఫోన్లు హ్యాక్ అవుతాయి. ఫలితంగా మనకు సంబంధం లేకుండానే మన ఫోన్ నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళుతుంది. తమ ఫోన్ హ్యాక్ అయిందన్న విషయం తెలియని వారు ఎవరికైనా డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా సొమ్ము పంపితే, వెంటనే హ్యాక్ చేసిన మొబైల్ నంబరు ద్వారా పిన్ నంబరు తెలుసుకుని నిమిషాల్లో ఆ వ్యక్తి బ్యాంకు ఖాతాలో వున్న సొమ్మును కాజేస్తున్నారు. హ్యాక్ చేసిన మొబైల్ డివైస్ డిస్‌ప్లే సైబర్ నేరగాళ్ల చేతిలో వుంటుంది. దీని ప్రకారం ఆ డివైస్‌లో వున్న కాంటాక్ట్ నంబర్లక, ఫోన్ హ్యాకింగ్‌కు గురైన వ్యక్తి పంపినట్టు ఏపీకే ఫైళ్లు పంపుతున్నారు. నిజంగానే మనకు తెలిసిన వ్యక్తి నుంచే ఈ మెసేజ్ వచ్చిందని భావించి ఏపీకే ఫైళ్ల లింక్‌ను ఓపెన్ చేస్తున్నారు. దీంతో బ్యాంకు ఖాతాల్లో వున్న సొమ్మును కోల్పోతున్నారు. సైబర్ నేరగాళ్లు ఇందులోనే మరో తరహా మోసానికి పాల్పడుతున్నారు. హ్యాక్ చేసిన వ్యక్తి డివైస్ ద్వారా కాంటాక్ట్ నంబర్లలో కొందరికి మెసేజ్ పెడుతున్నారు. తాను ఒక సమస్యలో ఇరుక్కున్నానని, దీని నుంచి బయటపడడానికి అర్జంటుగా కొంత సొమ్ము పంపాలని ... మిగతా 8వ పేజీలో



సైబర్‌నేరగాళ్లు పంపే ఏపీకే ఫైల్ లింక్

ఏపీకే మెసేజ్‌లతో ఫోన్ హ్యాక్



తెలిసిన లేదా అపరిచిత వ్యక్తుల పేరుతో వచ్చే ఏపీకే ఫైళ్ల గానీ, మీకు లాటరీ తగిలింది, ఈ లింక్ ఓపెన్ చేస్తే మీకు మంచి అవకాశం వుంటుందంటూ వచ్చే మెసేజ్‌లను నమ్మకూడదు. వాటిని వెంటనే తీసివేయాలి. సైబర్ నేరగాళ్లు పంపే ఏపీకే ఫైళ్లపై క్లిక్ చేయగానే 'దిస్ డాక్యుమెంట్ మైట్ బీ హార్మ్‌ఫుల్ ఫర్ యువర్ డివైస్' అని వస్తుంది. ఇటువంటి ఫైళ్లపై క్లిక్ చేసినా, ఫైల్ ఓపెన్ చేసినా ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం వుంది. సైబర్ నేరగాళ్లు డబ్బు లూటీ చేసేందుకు ప్రయత్నిస్తే వెంటనే సమీపంలో వున్న పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలి.

కుమారస్వామి, నక్కపల్లి సీఐ

వీఎంఆర్‌డీఏ కొత్త లేఅవుట్లు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏర్పాట్లు

- నాలుగు ప్రాంతాల్లో 46 ఎకరాల్లో 538 ప్లాట్లు
- ఏడాదిలోగా ప్లాట్లను వేలానికి సిద్ధం చేయాలని నిర్ణయం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) కొత్త లేఅవుట్ల ఏర్పాటుపై దృష్టిసారించింది. వైసీపీ ప్రభుత్వంలో ఎంఐజీ టౌన్‌షిప్‌లు వేసినా పెద్దగా స్పందన రాలేదు. ఆనందపురం మండలం పాలవలస మినహా మిగిలిన చోట్ల లేఅవుట్లలో ప్లాట్ల కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో సంస్థకు ఉన్న భూముల్లో లేఅవుట్లు వేయాలని నిర్ణయించింది. మొత్తం 46 ఎకరాల్లో 538 ప్లాట్లు వచ్చేలా ప్లానింగ్ విభాగం ప్రణాళికలు రూపొందించింది.

- భీమిలి మండలం కాపులుప్పాడలో 20.48 ఎకరాల్లో 209 ప్లాట్లు వేసేందుకు ప్లాన్ సిద్ధం చేసింది. ఆ భూమిని అభివృద్ధి చేయడానికి రూ.14.51 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. వాటిని విక్రయిస్తే రూ.86 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.
- భీమిలి మండలం నిడిగట్టులో 8.15 ఎకరాలలో 103 ప్లాట్లు వేయడానికి రూ.519 కోట్లు ఖర్చుతో ప్రణాళిక వేశారు. వీటి అమ్మకం ద్వారా రూ.23 కోట్లు వసుందని భావిస్తున్నారు.
- పెందుర్తి మండలం చినముషిడివాడలో 4.7 ఎకరాలలో 84 ప్లాట్లు వేయడానికి రూ.3.1 కోట్లు ఖర్చు అవుతుందని, వాటి విక్రయం ద్వారా రూ.40 కోట్లు వస్తుందని అంచనా వేశారు.
- అనకాపల్లి మండలం తుమ్మపాలలో 12.68 ఎకరాలలో 142 ప్లాట్లు వేయడానికి రూ.5 కోట్లు ఖర్చు అవుతుందని, వాటి ... మిగతా 8వ పేజీలో

కార్పొరేషన్లలో మరో ముగ్గురికి అవకాశం

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తూర్పు కాపు, మాదిగ, తదితర కార్పొరేషన్లకు సభ్యులను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. తూర్పు కాపు కార్పొరేషన్‌లో భీమిలి నియోజకవర్గం నుంచి టీడీపీకి చెందిన కురిమిన లీలావతికి అవకాశం లభించింది. మాదిగ కార్పొరేషన్‌లో సభ్యులుగా విశాఖ ఉత్తర నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకురాలు ఈతలపాక సుజాతకు, ఎలమంచిలి నుంచి టీడీపీకి చెందిన డొక్కా నాగభూషణం నియమితులయ్యారు.

డయాబెటిస్‌పై విద్యార్థులకు అవగాహన

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ డయాబెటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా దండుగోపాలపురం పీహెచ్‌సీ వైద్యులు బి. సుధీర్ ఆన్‌లైన్‌లో మధుమేహ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ, నివారణల గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు రేఖా రామారావు, అర్జున అప్పారావు, కె. సుజాత పాల్గొన్నారు.

ఏయూ బ్యాడ్మింటన్ జట్టు కోచ్‌గా పోలిరెడ్డి



ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంటులో పాల్గొనే ఆంధ్రయూనివర్సిటీ బ్యాడ్మింటన్ జట్టు కోచ్‌గా ఎలమంచిలి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ వై.పోలిరెడ్డి నియమితులయ్యారు. డిసెంబరు 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయాల టోర్నీలో ఏయూ జట్టు పాల్గొంటున్నదని పోలిరెడ్డి చెప్పారు.

చినతీనార్లలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన దృశ్యం

నక్కపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినతీనార్లలో హెటిరో యాజమాన్యం నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడిని నివారించాలని గ్రామస్థులు కోరడంతో సీఎస్ఆర్ నిధులతో వాటర్‌ప్లాంట్‌ను నిర్మించారు. ఈ మేరకు హెటిరో ప్రతినిధులు ఎస్.కుల్లారెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాస్, సర్పంచ్ ఎం.ముసలయ్య, గ్రామ పెద్దలు నీటిని మహిళలకు అందజేశారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకున్న గ్రామస్థులు



రాజయ్యపేటలో స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకున్న దృశ్యం

నక్కపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేటలో అదానీ కంపెనీకి చెందిన విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును సీపీఎం నాయకులు, గ్రామస్థులు గురువారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ వినియోగదారులకు తెలియకుండా ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాన్, అప్పలరాజు, అంజి, తాతీలు, బయ్యన్న, బాపూజీ పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన అవసరం

అచ్యుతాపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలు వంటి వాటిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ వై.సత్యనారాయణ అన్నారు. పదో బీఎన్ ఎన్‌డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో గురువారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు, తహసీల్దార్ జీవీ జనార్దన్, ఎంఈవోలు దేవరాయల్, రజని, హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు మరచిపోవద్దు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నునపర్తి రామాలయంలో గురువారం సమరసతా సేవా ఫౌండేషన్ ధర్మదీక్షా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఎలమంచిలి సబ్ డివిజన్ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను మరిచిపోకుండా పాటిస్తే దేశం క్షేమంగా ఉంటుందన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

- గత ఐదేళ్లు అధ్వాన స్థితిలో రోడ్లు
- కూటమి ప్రభుత్వం రావడంతో నిధుల వరద
- మండలంలో 66 రోడ్ల పనులు ప్రారంభం
- ఇప్పటికే 13 పూర్తి, 53 రోడ్లు పనులు చకచకా
- ఆనందంలో గ్రామీణులు



పందూరులో సీసీరోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కోటవురట్ల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారుల పనులు పరుగులు తీస్తున్నాయి. నిన్నటి వరకు గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డ గ్రామీణులు ప్రస్తుతం సంబరపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పల్లె పండుగ' కార్యక్రమం అనంతరం మండలంలో రహదారుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీసీరోడ్లు, బీటీరోడ్ల పనులకు అధికారులు, ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లె రోడ్లకు 75 శాతం జాతీయ ఉపాధి హామీ, మిగతా 25శాతం పంచాయతీ నిధులు వ్యయం చేస్తోంది. 25 శాతం నిధుల కింద మండలానికి రూ.1.88 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో ఎక్కువగా సీసీ రోడ్ల పనులు మంజూరయ్యాయి. రాజుపేట, రామన్నపాలెం గ్రామాల్లో సీసీరోడ్లతోపాటు డ్రైనేజీలు మంజూరయ్యాయి. నెల రోజుల్లో 13 రోడ్ల నిర్మాణ పనులు పూర్తికాగా, మిగతా 53 రోడ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్నిచోట్ల డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. ఈ పనులన్నింటిని సంక్రాంతి లోపు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ దిశగా అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. రోడ్లన్నీ పూర్తయితే సంక్రాంతికి పల్లెల రహదారులకు నూతన శోభ రానుంది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో పల్లెల రోడ్లను ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఎక్కడిక్కడ రోడ్లు అధ్వాన స్థితికి చేరి, ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. వర్షాలు కురిసిన సమయాల్లో అడుగు వేయలేని దుస్థితి నెలకొంది.

వైసీపీ పాలనలో నరకం చూశాం

పెట్ల లింగంనాయుడు, సర్పంచ్, బీకేపల్లి



గత వైసీపీ పాలనలో కనీసం సౌకర్యాలు కల్పించలేకపోయారు. ప్రజలకు కనీసం ముఖం చూపించలేకపోయాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తల ఎత్తుకొని తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 4 నెలల్లో రూ.15.6లక్షలతో ఐదు సిమెంట్లు రోడ్లు పనులు చేయిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

పనులు వేగంగా చేయిస్తున్నాం

వర్మ, మండల ఇంజనీర్



ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా సీసీరోడ్ల పనులు వేగవంతంగా చేయిస్తున్నాం. ప్రణాళిక బద్ధంగా పనులను చేయిస్తున్నాం. ఇప్పటికే 13 పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పనులను నాణ్యతతో చేయిస్తున్నాం. సంక్రాంతిలోపు పనులన్నీ పూర్తి చేయిస్తాం.

ఘనంగా బాలల దినోత్సవం



అచ్యుతాపురంరూరల్: ఓడపాలెంలో నెహ్రూ పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీతోపాటు మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఎలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి. విజయ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో విజేతలైన దివ్యాంగ విద్యార్థులకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం నిర్వహణకు కె.పద్మావతి వెయ్యి రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, ఎంఈఓ అరుణ్‌కుమార్, హెచ్ఎం భవానీ, ఉపాధ్యాయులు భవిత కేంద్రం నిర్వాహకులు మూర్తి, అనురాధ పాల్గొన్నారు. అదేవిధంగా కొక్కిరాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ మీనాక్షి, విద్యా కమిటీ చైర్మన్ రమణ, వీసం ధనలక్ష్మి, హెచ్ఎం, ఆకుల పాపాజీరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

మండలంలో గురువారం బాలల దినోత్సవాన్ని పెదబోదిగల్లం, రాజయ్యపేట, వేంపాడు, చినదొడ్డిగల్లు, గొడిచెర్ల, దేవవరం, జానకయ్యపేట, నక్కపల్లి కేజీబీవీ, గురుకులం, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు చోడిశెట్టి సత్యనారాయణ, మూర్తిరాజు ,నారాయణరావు, కవిత, సలీమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్‌లో..

మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దిబ్బపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం స్వర్ణలత, ఓడపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం వి.ఎస్తేరు రాణి నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్‌పీసీఎల్‌డీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ గంటాడ నాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పెదగుమ్ములూరు, ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గురువారం ఆయా ప్రధానోపాధ్యాయులు సుధాకర్, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉపాధ్యాయులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాయకరావుపేటలో..

పట్టణంలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక గౌతమ్ మోడల్ స్కూల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థులు వివిధ వేషధారణల్లో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.అశోక్ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని పెదరాంభద్రపురం జడ్పీ హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.



ఎలమంచిలి: దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ



పాయకరావుపేట: గౌతమ్ మోడల్ స్కూల్లో వివిధ వేషధారణలతో విద్యార్థులు

పుస్తక పఠనంతోనే ఉన్నత శిఖరాలు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్



పాయకరావుపేటలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకుని గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వక్తలు చంద్రశేఖర్, అధ్యాపకులు డి. వెంకట్రావు, ఆడారి పూరీ జగన్నాథం గ్రంథాలయాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆనంద్, స్థానికులు ఈ.సాంబశివరావు, షేక్ అబ్దుల్లా, డి. ప్రకాష్, సన్యాసిబాబు, పీడీ దుర్గారావు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

గ్రంథాలయాలను అన్ని వర్గాలు సద్వినియోగం చేసుకుని మేధా సంపద పెంపొందించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పెదిరెడ్డి చిట్టిబాబు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవిరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పెదిరెడ్డి చిట్టిబాబు మాట్లాడుతూ విజ్ఞానాన్ని సముపార్జించుకునేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కేఎన్.గాంధీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, వార్డు సభ్యులు పెంకే గోవిందు, బీజేపీ నాయకుడు వి. వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు జగతా శ్రీధర్, ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గుమ్మడి అమ్మలు పేరంటాల ఉత్సవాలు



హారతిని అందుకుంటున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరులో కొలువైన గుమ్మడి అమ్మలు పేరంటాలు ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జనసేన పార్టీ రాష్ట్ర నాయకుడు సుందరపు సతీష్‌కుమార్, కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు రాజకీయ ప్రముఖులు అమ్మవారిని దర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జబర్దస్త్ హాస్యవల్లరి, సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి మండలాలకు చెందిన జనసేన, టీడీపీకి చెందిన నేతలు బైలపూడి రామదాసు, పప్పల నూకన్నదొర, జనపరెడ్డి శ్రీనివాసరావు, వి.దిన్‌బాబు హాజరయ్యారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

గుమ్మడి అమ్మలు పేరంటాలు ఉత్సవాల సందర్భంగా కొత్తూరులో వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జనసేన పార్టీ రాష్ట్రనేత సుందరపు సతీష్‌కుమార్, తండ్రి సుందరపు సత్యనారాయణ ప్రారంభించారు. ముందుగా ఆయన వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీల్లో ఏడు జట్లు పాల్గొంటున్నాయి.

108 ఉద్యోగుల సమస్యలు తీర్చండి

అచ్యుతాపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకుంటే ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని స్థానిక ఉద్యోగులు హెచ్చరించారు. ఈనెల 11న తమ సమస్యలపై సమ్మె నోటీసులు జారీ చేశామని, పరిష్కారం కాని పక్షంలో ఈనెల 25 నుంచి సమ్మెలోకి దిగాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు

ఎస్.రాయవరంలో..

108 వ్యవస్థను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉద్యోగులు అడ్డరోడ్డులో నిరసన తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి దిగుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 108 పైలట్లు డి. శ్రీనివాసరావు, ఎ. సత్యనారాయణ, ఈఎమ్‌టీ ఎస్‌టీ రాజేష్, ఎ. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా గౌరీదేవి ఊరేగింపు

పాయకరావుపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్యజ్యోతి): మండలంలోని సత్యవరం గ్రామంలో గౌరీదేవిని బుధవారం రాత్రి పల్లకిలో ఘనంగా ఊరేగించిన అనంతరం గ్రామంలోని ఆలయంలో నిలిపారు. గత 150 సంవత్సరాలుగా ప్రతీ ఏటా కార్తీక పౌర్ణమి ముందు రోజు గౌరీశంకరుల విగ్రహాన్ని తునిలోని సీతారామయ్య సిద్ధాంతి ఇంటి వద్ద నుంచి తీసుకురావడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. కార్తీక పౌర్ణమికి నోము నోచి అమ్మవారిని పూజిస్తారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మంత్రి నిమ్మలను కలిసిన ప్రగడ



జలవనరుల శాఖ మంత్రి రామానాయుడును కలిసిన ఏపీఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని అమరావతిలో ఏపీఆర్‌డీసీ చైర్మన్, టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మంత్రిని కలిసి కొద్దిసేపు మాట్లాడారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి దూళి రంగనాయకులు ఉన్నారు.

ఇంటింటి సర్వే సమగ్రంగా చేయాలి

పాయకరావుపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కార్యకరలు, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సమగ్రంగా సర్వే చేయాలని ఎంపీడీవో ఎ. జయప్రకాశరావు అన్నారు. మండలంలోని నామవరంలో గురువారం వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఎన్‌సీడీసీడీ 3.0 సర్వే (కేన్సర్, షుగర్, వంటి వ్యాధులపై సర్వే)ను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పీఎం సూర్యఘర్, ఇంటింటికి జియో ట్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం సిమెంటు రోడ్డు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునాచారి, టీడీపీ నాయకులు కురందాసు శివ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన ప్రగడ



అచ్యుతాపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవవనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరిపాలన, పార్టీ అంశాలపై ఆయనతో చర్చించారు. తనకు అప్పగించిన బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తానన్నారు.

ఆశ్రమ పాఠశాలకు సీఐఎస్ఎఫ్ వితరణ



దివ్యాంగులతో సీఐఎస్ఎఫ్ పోలీసుల సతీమణులు

అచ్యుతాపురం రూరల్, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి): స్థానిక ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ పాఠశాలకు స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ సతీమణుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నిత్యావసర సరకులు, స్టేషనరీ అందజేశారు. బాలల దినోత్సవం సందర్భంగా గురువారం ఆశ్రమ పాఠశాలకు వచ్చిన స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ అత్తార్ మొహమ్మద్ హనీఫ్ చేతుల మీదుగా రూ.60 వేల విలువైన నిత్యావసర సరకులతో పాటు స్టేషనరీ, దివ్యాంగ విద్యార్థులకు అవసరమయ్యే వివిధ వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పీఎస్‌టీ పట్నాయక్, ప్రిన్సిపాల్ పాలిపిల్లి శ్రీను, అసోసియేషన్ ప్రతినిధులు తబసుమ్ మొహమ్మద్ హనీఫ్, సీఐఎస్ఎస్ పోలీసుల సతీమణులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యులకు రూ.5 లక్షల బీమా

పాయకరావుపేట రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ క్రియాశీలక సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమాతో ఆ కుటుంబానికి పార్టీ భరోసా కల్పిస్తుందని టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గొర్లె రాజుబాబు అన్నారు. మండలంలోని సత్యవరంలో గురువారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మజ్జూరి నారాయణరావు, సఖిలేటి నాగేశ్వరరావు, గొల్లపల్లి నాగు, శివ, పడాల కోటి, దాసరి రాజేష్, నానాజీ, సఖిలేటి వీరబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై సిబ్బందికి శిక్షణ

పాయకరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 23వ తేదీన జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలను పగడ్బందీగా నిర్వహించేందుకు సిబ్బంది కృషిచేయాలని ఇరిగేషన్ డీఈఈ జగదీశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, ఇతర సిబ్బందికి సాగునీటి ఎన్నికల నిర్వహణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ మండలంలో ఏడు సాగునీటి సంఘాలుండగా ఒక్కో సంఘానికి ఆరుగురు ప్రాదేశిక సభ్యులు ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం వీరి నుంచి సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈనెల 23వ తేదీన నామినేషన్లు స్వీకరణ, ఎన్నిక జరుగుతుందన్నారు. అనంతరం అదేరోజున సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నిక కూడా జరుగుతుందన్నారు. సమావేశంలో ఇరిగేషన్ ఏఈ శ్రీరామ్మూర్తి, ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికే ప్రజా పోరు

రాంబిల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో ప్రజా పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు అన్నారు. గురువారం కొత్తపట్నం, వాడనర్సాపురం, గోవిందపాలెం, రాంబిల్లి, జిరాయితీ చింతువా పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల సీపీఎం నేతలు నిరసన చేసి, వినతిపత్రాలను సచివాలయం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువులు ధరలు పెంచి పేద, సామాన్య ప్రజలు నడ్డి విరుస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎస్.నారాయణరావు, దోని కాశియ్య, చందక రమణ, సీహెచ్ గంగరాజు, అప్పలరాజు, పాపారావు, నూకరాజు పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నేతలు గురువారం నిరసన తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, సీపీఎం మండల కార్యదర్శి ఎం.రాజేశ్ మాట్లాడుతూ పామాయిల్ సహా అనేక నిత్యావసర సరుకుల ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎ.అప్పలరాజు, వి. అప్పారావు, ఎం.రమణ, పి. వెంకన్న పాల్గొన్నారు.

సంప్రదాయ పిండి వంటల తయారీపై శిక్షణ

పాయకరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు సంప్రదాయ పిండివంటల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈనెల 12వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో 20 మంది విద్యార్థినులకు వివిధ రకాల పిండివంటల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, ఏషియన్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజిమెంట్ డైరెక్టర్ వై.రాజేష్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డి.రూపస్వర్ణకుమారి పాల్గొన్నారు.

నేడు ఆరు గంటలు పవర్ కట్

పాయకరావుపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో చెట్ల కొమ్మల నరికివేతకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈపీడీసీఎల్ అనకాపల్లి ఆపరేషన్ డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. పట్టణంలోని 11 కేవీ పాయకరావుపేట, రాజగారిబీడు ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక మంగవరం రోడ్డు, జగతావారి వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్, పాండురంగస్వామి గుడి, మంగవరం రోడ్డు శివారు బరియల్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందన్నారు.

అంటువ్యాధులపై ఇంటి సర్వే ప్రారంభం

ఎస్.రాయవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంటువ్యాధులపై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని మండలంలోని ఉప్పరాపల్లి గ్రామంలో సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ వాసంతి గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అల్లూరి పార్కులో పర్యాటకుల సందడి



పార్కులో ఆటపాటలతో సరదాగా గడుపుతున్న పిల్లలు, పెద్దలు

కృష్ణాదేవిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం సందర్భంగా గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలోని అల్లూరి సీతారామరాజు పార్కు సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబాలతో సహా ఇక్కడికి విచ్చేస్తున్నారు. గురువారం అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలుత పార్కులో గల స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గంటందొరల సమాధులను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఇక్కడి ప్రకృతి అందాల నడుమ సరదాగా గడిపారు. మధ్యాహ్నం పిల్లలు, పెద్దలు సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు ఆటపాటలతో తెగ ఎంజాయ్ చేశారు. పార్కులో సౌకర్యాలు కల్పించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సిందిగా పలువురు కోరారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలో 70 మందికి రక్త, బీపీ తదితర పరీక్షలు జరిపారు. వ్యాధులు ఉన్నవారికి మందులు అందజేసి, పలు సూచనలు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మారుతీకృష్ణ, డాక్టర్ మహేష్, పూర్వపు గవర్నర్ డాక్టర్ అధికారి గోపాలరావు, డాక్టర్ రాయపురెడ్డి శ్రీనివాసరావు, విప్పల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగులో మెలకువలతో అధిక దిగుబడి



ఆయిల్‌పామ్ సాగులో మెలకువలు వివరిస్తున్న మేనేజర్ చంద్రశేఖర్

నాతవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానవన శాఖాధికారిణి ఎస్.శిరీషా, పతంజలి మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పీఎస్‌డీపాలెంలో గురువారం ఆయిల్‌పామ్ సాగు రైతులతో ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. బిందు సేద్యం, ఫెర్టిగేషన్, మల్చింగ్ వంటి పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఎలా పొందాలో వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో కేన్సర్‌పై స్ర్కీనింగ్ పరీక్షలు



గొలుగొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పీహెచ్‌సీ సిబ్బంది గురువారం గొలుగొండ, జోగంపేట గ్రామాల్లో కేన్సర్ నుంచి రక్షించేందుకు ముందస్తుగా స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ కేన్సర్‌ను ముందుగా గుర్తిస్తే వ్యాధి నుంచి బయట పడవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వివిధ పాఠశాల విద్యార్థుల వేషధారణలు



ఘనంగా బాలల దినోత్సవం

» పాఠశాలల్లో సందడి » మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటాలకు నివాళులు » దేశ నాయకుల వేషధారణలతో అలరించిన విద్యార్థులు

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలల దినోత్సవాన్ని గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ వేడుకలకు నర్సీపట్నం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్ ముఖ్య అతిథిగా హాజరై పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను, అందుకు కారణమైన వ్యాయామ ఉపాధ్యాయిని దేవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని హిమబిందు, రాజగోపాల్ పాల్గొన్నారు.

ఇదిలావుంటే, పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నర్సీపట్నంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. సిటీ క్లబ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. సినీ, జానపద నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జిల్లా స్థాయి బాలల ప్రతిభా పాటవ పోటీల విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థులు గీసిన చిత్రాలు, మట్టి, కాగితం కళాకృతులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలలో బంగారు పతకం సాధించిన బొంతు మౌనికను ఎంఈవో నాగేంద్ర, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీనాథ్, నింజాస్ అకాడమీ డైరెక్టర్ వెలగా నారాయణరావు, దొరబాబు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రతినిధులు అడిగర్ల వరహాలనాయుడు, జీవీ రమేశ్, అల్లు అప్పారావు, ఎంఎస్ ప్రసాద్, కురచ రమణ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ/ కృష్ణాదేవిపేట : మండలంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని జరిపారు. గొలుగొండ, చోద్యం, లింగంపేట, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, కొంగసింగి, నాగాపురం తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో తొలుత నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చోద్యం హైస్కూల్‌లో పలువురు విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలతో అలరించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చెట్టుపల్లి పాఠశాలలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జడ్జి షియాజ్ ఖాన్

మాకవరపాలెం : బాలల దినోత్సవాన్ని మండలంలో పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో హెచ్‌ఎం రాము తొలుత జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం దేశానికి ఆయన అందించిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, కస్తూర్బా గాంధీ పాఠశాలలో పాఠశాల ప్రత్యేకాధికారిణి త్రివేణి ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. డి.యర్రవరం సంస్కృతి పాఠశాలలో జరిగిన ఈ వేడుకల్లో తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం చిన్నారులు జానపద నృత్యాలు, క్లాసికల్ డ్యాన్స్‌లతో అలరించారు. కరస్పాండెంట్ ఎ.గిరిబాబు, ప్రిన్సిపాల్ పి.రేవతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎంఈవో నాగేంద్ర ముఖ్య అతిథిగా హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి వేడుకలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రంథాలయాధికారిణి దమయంతి మాట్లాడుతూ ప్రతి రోజూ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి చివరి రోజున బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గ్రంథాలయాధికారి మురళి, త్రిమూర్తులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెంలో...

మాకవరపాలెం : గ్రంథాలయాల ద్వారా విద్యార్థులకు ఎంతో విజ్ఞానం పెరుగుతుందని ఇక్కడి గ్రంథాలయాధికారిణి చంద్రకళ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను గురువారం ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు చదరంగ పోటీలు నిర్వహించారు. మాకవరపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు అచ్యుత్ రామయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరల పెరుగుదలపై ధర్నా

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదలకు నిసనగా ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరకులు, వంట నూనెలు, కూరగాయల ధరలు పెరిగాయన్నారు. రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరకులు సరసమైన ధరలకు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల భారం తగదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ త్వరితగతిన అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అడిగర్ల రాజు, జి.కోటేశ్వరరావు, ఐద్వా నాయకురాళ్లు ఎల్.గౌరీ, కేవీ సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ సభల్లో 783 అర్జీలు'

కృష్ణాదేవిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం కొంగసింగిలో గురువారం రెవెన్యూ గ్రామ సభ ఏర్పాటైంది. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఈ సభలు చక్కగా దోహదపడతాయన్నారు. దీంతో పలువురు గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూముల రీ సర్వేలో లోటుపాట్లపై అర్జీలను సమర్పించారు. ఇప్పటి వరకు మండలంలోని 24 గ్రామాల్లో చేపట్టిన గ్రామ సభల్లో 783 అర్జీలు అందినట్టు తహసీల్దార్ చెప్పారు. వీటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ కొండబాబు, ఆర్‌ఐ నాగరాజు, సర్వేయర్ సత్యనారాయణ, సర్పంచ్ యలమంచిలి నూకరత్నం, కూటమి నాయకులు యలమంచిలి వరహాలబాబు, మల్లేష్, మణిబాబు, మరిడిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై 108 సిబ్బంది వినతి

మాకవరపాలెం, నవంబరు 14 (ఆంధ్ర జ్యోతి) : సమస్యలు పరిష్కించాలని కోరుతూ 108 సిబ్బంది గురువారం ఎంపీడీవో సీతామహాలక్ష్మి, డిప్యూటీ తహ సీల్దార్ సోమశేఖర్‌కు వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మె చేస్తామని స్పష్టం చేశారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన ర్యాలీ

కృష్ణాదేవిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మధుమేహ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఎన్.హరిప్రవీణ్, ఎస్.గాయత్రి సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి గురువారం ఇక్కడ ర్యాలీ నిర్వహించారు. వాధి రాకుండా, వచ్చిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైద్య సిబ్బంది సావిత్రి, సత్యనారాయణ, వరలక్ష్మి, లక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా గ్రామాల అభివృద్ధి

మాకవరపాలెం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేసే బాధ్యత ప్రజా ప్రతినిధులదేనని ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామాల అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రాచపల్లి ఎంపీటీసీ ఆర్‌వై పాత్రుడు, మాకవరపాలెం ఈవో బాలదొర పాల్గొన్నారు.

గొలుగొండ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి పిలుపునిచ్చారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో గురువారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఏప పనులు చేపట్టాలో ముందుగా గుర్తించాలన్నారు ఎంపీడీవో మేరీ రోజీ మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు, వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ, ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తాచాటిన చిన్నారులు



పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన బాలలు

చోడవరం, నవంబరు13(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో చోడవరం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు సత్తాచాటి పతకాలు సాధించారు. గాజువాకలో ఈనెల 13 బుధవారం జరిగిన 38వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో విద్యార్థులు వివిధ విభాగాలలో 12 బంగారు పతకాలు, 10 రజత, 13 కాంస్య పతకాలు సాధించినట్టు ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ తెలిపారు. కోచ్‌లుగా నోకియా ప్రసాద్, శేఖర్, రమేష్,జాన్‌సాగర్ వ్యవహరించారు.

మంగళాపురం ఆనకట్ట పూర్తికి నిధులు ఇవ్వండి



మంత్రి నిమ్మలకు వినతిపత్రం ఇస్తున్న జనసేన నేత పీవీ ఎస్ ఎన్ రాజు, పక్కన బీజేపీ నేత ఈర్లె శ్రీరామమూర్తి

చోడవరం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధి బుచ్చెయ్యపేట మండలం మంగళాపురం వద్ద కొట్టుకుపోయిన ఆనకట్ట నిర్మాణం పూర్తి చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పీవీ ఎస్ ఎన్ రాజు విజ్ఞప్తి చేశారు. గురువారం బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి, బుచ్చెయ్యపేట జనసేన నాయకులతో అమరావతిలో మంత్రిని కలిసి పరిస్థితి వివరించారు. మంగళాపురం వద్ద ఆనకట్ట కొట్టుకుపోవడంతో ఐదేళ్లుగా ఆయకట్టు రైతులు సాగునీరు అందక పంటలు వేసుకోలేని పరిస్థితి ఉందని వివరించారు. స్పందించిన మంత్రి నిమ్మల ఆనకట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు డీ ఎస్ నాయుడు, తుమ్మపాల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణ మండం పరిశీలన'

చీడికాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖండివరం గ్రామంలోని మెయిన్‌రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీని ఆక్రమించి తులసీ కల్యాణ మండపాన్ని కాంట్రాక్టర్ నిర్మించారని గ్రామానికి చెందిన పాము జగన్నాథం అనకాపల్లిలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. దీనిపై డీపీవో శిరీషరాణి, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి, ఈవోపీఆర్‌డీ ఎం. కామేశ్వరరావులు గురువారం ఖండివరంలో ఈ కళ్యాణ మండపాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ స్థలంలో పంచాయతీ తీర్మానం మేరకు పాడిరైతులకు ఈ కళ్యాణమండపం నిర్మిం చినట్టు వివరించారు. ఈ విచారణలో విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ సింగంపల్లి ముత్యాలనాయుడు, పంచాయతీ కార్యదర్శులు పీలా పద్మావతి, ఎం.వీర్రాజు, సర్పంచ్ కుమారుడు ఎస్‌వీఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు విద్యార్థిని ఎంపిక



ఎంపికైన మౌనిక

చోడవరం, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉషోదయ డిగ్రీ కళాశాల విద్యార్థిని చెల్లిబోయిన మౌనిక జాతీయస్థాయి అంతర్ కళాశాలల పోటీలకు ఎంపికైంది. ఆంధ్రాయూనివర్సిటీలో గురువారం నిర్వహించిన ఇంటర్ కాలేజీ స్టేట్ మీట్‌లో జూడో పోటీల్లో మౌనిక ప్రథమ స్థానం సాధించింది. కళాశాల చైర్మన్ జె. రమణాజీ, కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ ఎస్.వీ.వాసు, ప్రిన్సిపాల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి. దొరబాబు, అధ్యాపకులు అభినందించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

చోడవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలనుఎంఈవోలు తిరుపతిరావు, సింహాచలం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాలను సందర్శించేలా విద్యార్థులు అలవర్చుకోవాలని వారు సూచించారు. పుస్తకపఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జి.తిరుమలకుమారి, కె. కాలనీ స్కూల్ హెచ్ ఎం గొల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంఈవో తిరుపతిరావు



మాట్లాడుతున్న హెచ్‌ఎం ప్రసాద్

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎస్ ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, లైబ్రేరియన్ మాల్యాద్రి, వైస్ ప్రిన్సిపాల్ సత్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ

చీడికాడ: తురువోలు హైస్కూల్ పూర్వ విద్యార్థులు రూ.30వేలు విలువైన లై బ్రరీ పుస్తకాలు తురువోలు ఎంపీటీసీ బీళ్ల కోటేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొడ్డు శ్రీరామ్మూర్తి చేతులమీదుగా గురువారం విద్యార్థులకు అందించారు. హెచ్‌ఎం రామకృష్ణ, ఏపీటీఎఫ్ నేత జీపీఏ నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోలుగుంట: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు దోహదపడుతాయని స్థానిక జడ్పీ పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే యువకులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. లైబ్రేరియన్ ఎస్.వరలక్ష్మి, సీఆర్పీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ: గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఎంఈవోలు కె.బొంజుబాబు, బీవీ.రమణ కోరారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముందుగా జెండావందనం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.చీడికాడ హైస్కూల్ పీడీ మల్లేశ్వరి, ప్రసాద్ మాష్టారు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: చౌడువాడలో శాఖ గ్రంథాలయాధికారిణి మడ్డు పద్మావతి, కె. కోటపాడులో లైబ్రేరియన్ కె. సౌమ్యగ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు బోకం సన్నిబాబు, పంచాయతీ కార్యదర్శులు తాళ్లూరు సురేష్, కోటపాడు సచివాలయ సిబ్బంది,పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

చీడికాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి):బైలపూడి గ్రామంలో పరదేశమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, బుచ్చెయ్యపేట జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, చోడవరం మాజీ జడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు గొల్లవిల్లి రాజబాబు, చుక్క అప్పలనాయుడు, కురచా నారాయణమూర్తి, పరవాడ రామారావు పూజలు చేశారు. అన్నసమారాధన నిర్వహించారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి: యూటీఎఫ్

చోడవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.వి. లక్ష్మి విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక కొత్తూరు బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన యూటీఎఫ్ సభ్యత్వ నమోదు హాజరయ్యారు. నాయకులు రాపేటి కొండలరావు, వేగి సూర్యప్రకాశరావు, కె. చంద్రరావు, కె. రామచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

23న సాగునీటి సంఘాలకు ఎన్నికలు

చీడికాడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎన్నికల పీవో సీ హెచ్.జయరామ్ ఎన్నికల సిబ్బందిని కోరారు. సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సుమారు 80మంది ఉద్యోగులకు గురువారం మధ్యాహ్నం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోనాం జలాశయం పరిధిలో ఆరు మీడియం సంఘాలు, మూడు మైనర్ సంఘాలున్నాయన్నారు. వీటి పరిధిలో ఎన్నికలు నిర్వహించనున్నామని తెలిపారు. ఎంపీడీవో వి.హేమసుందర్రావు, తహసీల్దార్ వైవిఎస్ ప్రసాద్, ఈవోపీఆర్‌డీ ఎం. కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సాగునీటి సంఘం ఎన్నికలకు సిద్ధంకండి

మాడుగుల: నీటి సంఘం ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కింతలి రమాదేవి పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఇరిగేషన్ ఏఈ భార్గవకుమార్, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్, ఏవో గోపాలరావు, ఏఈ ప్రకాశ్ పాల్గొన్నారు.

భూ సమస్యలపై 141 అర్జీలు

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలపై 141 దరఖాస్తులు వచ్చాయి. ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, సర్పంచ్ సత్యవెంకటరమణ డీటీ అబ్దుల్‌గఫూర్, సర్వేరు గోవిందరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవరాపల్లి ఎస్సీ కాలనీలో జరిగిన బాలల దినోత్సవంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ పెంటమ్మ, పాల్గొన్నారు. కాశీపురం, బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో, కైరళీ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

క్రీడలతో పిల్లలకు ఆరోగ్యం

మాడుగుల: క్రీడలతో చిన్నారులు ఆరోగ్యంగా ఎదుగుతారని చోడవరం బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనాధు ప్రసాదరావు అన్నారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకుని అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సత్యనాదరావు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు: స్థానిక అయ్యన్న ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో నెహ్రూ చిత్రపటానికి విద్యాసంస్థల డైరెక్టర్ నూర్జహాన్ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్నారులకు నూర్జహాన్ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రదర్శనలతో చిన్నారులు ఆకట్టుకున్నారు.ఉపాధ్యాయులు సుమతి, పద్మిని, జ్యోతి, శ్రావణి, శిరీష, సరోజ, స్వాతి, మున్నీ పాల్గొన్నారు.



వివిధ వేషధారణల్లో చిన్నారులు



విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ప్రసాదరావు

విద్యార్థులకు నోట్ బుక్‌లు పంపిణీ

కె. కోటపాడు జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు జన సైనికులు నోట్ పుస్తకాలు, పెన్నులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసైనికుడు గోపి నాగేశ్వరరావు, సూరిశెట్టి మహేశ్వరరావు, గోస రాజేష్, బొడ్డు శ్రీను, వెంకట్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: కొమరవోలు జడ్పీ పాఠశాలలో 20 మంది విద్యార్థులకు స్థానిక హెల్పింగ్ పీపుల్స్ యూత్ అధ్యక్షులు సామిరెడ్డి రామమూర్తినాయుడు తన సొంత నిధులతో స్పోర్ట్స్ డ్రెస్‌లను బహూకరించారు. హెచ్‌ఎం వెంకటరావు, ఉపాధ్యాయులున్నారు.


ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



జగనన్న కాలనీని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ

మాడుగుల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలని గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం మాడుగుల సమీపాన రామచంద్రపురం దారిలో గల జగనన్న కాలనీని సందర్శించారు. స్థలాలు కేటాయించినా ఇళ్ల నిర్మాణం చేపట్టకపోవడంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వద్దాది రంజిత్‌వర్మ, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి రమేష్, టీడీపీ బీసీసెల్ జిల్లా కార్యదర్శి లెక్కల కాశిబాబు, బూత్ ఇన్‌చార్జిలు డిల్లి నానాజీ, పల్లెల రాము, సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

మేకను మింగిన కొండ చిలువ



కొండచిలువను పట్టుకున్న గ్రామస్థులు

దేవరాపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరబ్బ శివారు కొండ కోడాబు కొండల ప్రాంతంలో మేకల మందలోకి గురువారం సాయంత్రం కొండ చిలువ చొరబడింది. ఓ మేకను మింగడానికి ప్రయత్నించింది. మేకల యజమాని దుంబరి నాగరాజు గుర్తించి కేకలు వేయడంతో పరిసర రైతులు చేరుకొని కొండ చిలువ నుంచి మేకను రక్షించేందుకు ప్రయత్నించారు. అది అప్పటికే మృతి చెందింది. వెంటనే స్నేక్ క్యాచర్ కృష్ణకు సమాచారం ఇవ్వడంతో పామును పట్టుకుని దట్టమైన అడవిలోకి విడిచి పెట్టాడు.

60 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కె.కోటపాడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎ. భీమవరం గ్రామంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి విశాఖ వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నైత్ర వైద్యశిబిరం జరిగింది. 60 మందికి పరీక్షలు నిర్వహించి 10 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసి ఆసుపత్రికి తరలించారు. గ్రామ సర్పంచ్ తర్రా సన్యాసమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో వైద్యనిపుణులు సిద్దు , అశోక్, ఫీల్డ్ సిబ్బంది సంతోషి భూపతి పాల్గొన్నారు.

'కష్టపడి పనిచేసేవారికి టీడీపీలో గుర్తింపు'

చోడవరం, నవంబరు14(ఆంధ్రజ్యోతి): పార్టీలోకష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు తెలిపారు. రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్‌ను గురువారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి డివైడర్ ఏర్పాటు ఎవరిపని?


అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రోడ్డుపై ఏర్పాటు చేసిన డివైడర్

సీతమ్మధార, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తప్పుడు మార్గంలో వెళ్లకుండా, అందరు నడవడానికి వీలుగా జీవీఎంసీ అధికారులు రహదారిని ఏర్పాటు చేశారు. దీంతో నక్కవానిపాలెం, మద్దిలపాలెం, చైతన్యనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు సక్రమ మార్గంలో ప్రయాణించేవారు. ఇంత ముఖ్యమైన రహదారిలో అర్ధరాత్రి దాటాక రహదారికి అడ్డంగా విభాజకాన్ని (డివైడర్) ఏర్పాటు చేశారు. మూడు రోజులు అలాగే ఉంచడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూడు రోజుల తర్వాత మరోసారి అర్ధరాత్రి వేళ రహదారి ప్రారంభానికి ముందు డివైడర్ కొత్తగా వెలిసింది. దీంతో స్థానికులు విస్తుపోయారు. ఎందుకు, ఎవరి కోసం వేశారో ఎవరికీ తెలియలేదు. ఇది ఎవరి పని? అన్న ఆలోచనలో పడ్డారు. రాత్రికి రాత్రికి డివైడర్లు ఏర్పాటుకు కారణం నక్కవానిపాలెం ఆరంభంలో వైన్ షాపు ఉండటమే కారణంగా గ్రహించారు. ప్రైవేట్ వ్యక్తులు తమకు కావలసిన విధంగా డివైడర్లు వేశారని తెలుసుకున్నారు. అధికారుల సహకారం లేకుండా ఇది జరిగే పనేనా? అని సంశయిస్తున్నారు. యూనియన్ బ్యాంక్, సీతమ్మధార రైతు బజార్‌కు వెళ్లేందుకు ఇదే రహదారి కావడంతో డివైడర్‌ను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఎవరికీ పట్టదా?

నక్కవానిపాలెం ప్రారంభానికి ముందు జనావాసాలు ఉండేచోట మద్యం దుకాణం ఉంది. ఆ పరిసరాల్లోనే ఆలయాలు ఉన్నాయి. అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, ఓ మిషనరీ స్కూల్ ఉండటంతో జీవీఎంసీ అధికారుల సహకారంతో రాత్రికి రాత్రి డివైడర్ ఏర్పాటు చేశారని స్థానికులు చెప్పుకొంటున్నారు. రెండు రోజులుగా మద్యం దుకాణం మూసి ఉంచినా, డివైడర్‌ను తొలగించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. డివైడర్‌ను రహదారికి అడ్డంగా పెట్టడంతో వాహనాలు తప్పుడు మార్గంలో వెళ్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు సైతం పట్టనట్టు వ్యవహరించడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణాన్ని ఇక్కడ నుంచి వేరొకచోటకు తరలించి, డివైడర్‌ను తొలగించాలని కోరుతున్నారు.

భారీ వాహనాల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

ప్రమాదాలు చోటుచేసుకోవడం జరుగుతుంది. మద్దిలపాలెంలోని పిఠాపురం కాలనీ నుంచి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఇంటికి వెళ్లే రోడ్డులోకి భారీ కంటెయినర్లు యథేచ్ఛగా వచ్చి వెళుతుంటాయి. రోడ్డుపైనే వాహనాన్ని ఉంచి లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుండడంతో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అలాగే మద్దిలపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారి పక్కనే సిమెంట్, ఐరన్‌లోడుతో వచ్చే భారీ వాహనాలు లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తుంటాయి. జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుండడంతో ట్రాఫిక్ జామ్ అయిపోతోంది. సమీపంలోనే ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ఉన్నప్పటికీ సిబ్బంది మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుంటారు. అదేవిధంగా గురుద్వారా జంక్షన్ నుంచి శాంతిపురం వెళ్లే రోడ్డులో ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు ఉండడంతో కంటెయినర్లు ఏ సమయంలో పడితే ఆ సమయంలో వచ్చివెళుతుంటాయి. భవన నిర్మాణ సామగ్రి రవాణా చేసే వాహనాల యజమానులు, బిల్డర్లు, వ్యాపారులతో కొంతమంది ట్రాఫిక్ అధికారులకు సత్సంబంధాలు ఉన్నాయి. దాంతో వారి వాహనాలు నచ్చిన సమయంలో నగరంలోకి ప్రవేశించి సరకు అన్‌లోడింగ్ చేసి తిరిగి వెళుతుంటాయి. డాబాగార్డెన్స్, వన్‌టౌన్‌లోని వివిధ మార్కెట్ల పరిసరాల్లో కూడా నిత్యం ఇదే పరిస్థితి కనిపిస్తుంటుంది. ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకూ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. ఆ సమయంలో జాతీయ రహదారిపై ఉన్న ట్రాఫిక్ కూడళ్ల వద్ద వాహనాలు భారీగా బారులు తీరి పోయి ఉంటాయి. కొన్నిచోట్ల అయితే రెండు, మూడుసార్లు సిగ్నల్ పడిన తర్వాత గానీ జంక్షన్‌ను దాటే పరిస్థితి ఉండదు. అలాంటి సమయంలో కూడా నగరంలోని అంతర్గత రోడ్లలో భారీ వాహనాలు రాకపోకలు సాగుతుండడం అన్ని వర్గాలవారికి ఇబ్బందిగా ఉంటోంది. వీటన్నింటిపై ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలకు వెనుకడుగు వేస్తున్నారు.

నిషేధిత వేళల్లో ప్రవేశిస్తే చర్యలు

నగరంలోకి నిషేధిత వేళల్లో భారీ వాహనాలు ప్రవేశించడం నేరం. అలా ఎక్కడైనా భారీ వాహనాలు ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నగరంలోకి రాత్రి పది నుంచి ఉదయం ఏడు గంటలు వరకు మాత్రమే భారీ వాహనాలను అనుమతిస్తున్నాం. తర్వాత భారీ వాహనాలు రాకుండా నూటికి నూరుశాతం అడ్డుకుంటున్నాం. ఒకటో అరా ఎక్కడైనా భారీ వాహనాలు వస్తే సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

-ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ

ఏసీ వైర్ల నుంచి రాలిన నిప్పురవ్వలతో ఆక్సిజన్ టవర్స్‌లో అగ్నిప్రమాదం

సీతమ్మధార, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వైర్ల నుంచి నిప్పురవ్వలు దీపావళి బాణసంచాపై పడడంతో సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించినట్లు చెబుతున్నారు. 32వ అంతస్తులోని ఒక ఇంటిలో మంటలు చెలరేగి అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఆ ఇంటిలో అద్దెకు ఉంటున్న శ్రీనివాస్ అనే వ్యక్తి కుమారుడు ఏసీ ఆన్ చేసి నిద్రపోతున్నాడు. ఏసీ చాలా సమయం పాటు వేసి ఉన్నప్పటికీ పనిచేయకపోగా, దానికి సంబంధించిన విద్యుత్ వైర్ల నుంచి నిప్పు రవ్వలు రాలాయి. ఇవి ఇంటిలో ఉన్న దీపావళి బాణసంచాపై పడటంతో మంటలు వ్యాపించాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంటిలో నిద్రపోతున్న శ్రీనివాస్ కుమారుడు కార్తిక్‌ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఆస్తి నష్టం తప్ప ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

శ్రీరెడ్డిపై తెలుగు మహిళల ఫిర్యాదు


ఫిర్యాదు అందజేస్తున్న మహిళలు

మహారాణిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని టూటౌన్ పోలీసు స్టేషన్లో తెలుగు మహిళలు సినీనటి శ్రీరెడ్డిపై గురువారం ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియాలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టింగ్‌లు పెట్టడంపై వారు అభ్యంతరం తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. తెలుగు మహిళా కార్యదర్శి గనగళ్ల సత్యవతి, భాగ్యలక్ష్మి, లీల, సత్యవతి, పిన్నింటి మధులక్ష్మి, ధనలక్ష్మి, సుగుణ, సూర్యనారాయణ, కమలప్రియ తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమి కొనుగోళ్ల సందడి

పూర్ణామార్కెట్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా పూర్ణామార్కెట్ గురువారం కొనుగోలుదారులతో సందడిగా కనిపించింది. పూజాసామగ్రి అమ్మకాలు జోరుగా సాగాయి. పౌర్ణమి పూజలో వినియోగించే అరటి పండ్లు, కొబ్బరి కాయలు, పండ్లు, పూలు, తమల పాకుల ధరలు రెండింతలు పెరిగాయి. పూజలో వినియోగించే పత్రి, మామిడి ఆకులు, ఉసిరికి డిమాండ్ పెరిగింది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి.

ట్రాఫిక్‌పై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ ఎం.శ్రీను, ఎస్‌ఐ కె.శ్రీలక్ష్మి

డాబాగార్డెన్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పొందితే ప్రమాదాల నియంత్రణకు దోహదపడవచ్చని తూర్పు ట్రాఫిక్ రెండో సీఐ ఎం.శ్రీను, టూటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ కె.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. డాబాగార్డెన్స్ ప్రియాంక విద్యోదయ పాఠశాలలో ట్రాఫిక్ నియామాలు, నియంత్రణ, రహదారులపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు సూచనలు చేశారు. రోడ్డు మధ్యలో నడవరాదని, రహదారులపై ప్రయాణ సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ సమస్యలపై అవగాహన కలిగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగ కార్పొరేషన్‌గా డైరెక్టర్‌గా ఈతలపాక సుజాత



కంచరపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) :కంచరపాలెం జీవీఎంసీ 55వ వార్డు టీడీపీ సీనియర్ నాయకురాలు ఈతలపాక సుజాతను మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సుజాత ప్రస్తుతం రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధిగా ఉన్నారు. తనను డైరెక్టర్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారాలోకేశ్, వర్లరామయ్య, హోం మంత్రి అనిత, పల్లా శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన ఎంపీ భరత్, గండి బాబ్జి, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తానన్నారు. ఈ సందర్భంగా సుజాతకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బాలలు అన్ని రంగాల్లో రాణించాలి


మాట్లాడుతున్న హనుమంతు ప్రభాకర్

డాబాగార్డెన్స్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూ మంచి పేరు పొందాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ అన్నారు. .గురువారం డాబాగార్డెన్స్‌లోని ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ పైడపునాయుడుతో కలిసి నెహ్రూ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాల్య జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించాలన్నారు. పోటీల్లో విజేతలను అభినందించారు.

ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ తదితరులు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస, కిరండోల్ (కేకే) లైనులో జగదల్‌పూర్ సమీపంలోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ) స్టీల్ లిమిటెడ్‌లో నాగర్నార్ రైల్వే సైడింగ్ కోసం కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన ఓవర్ హెడ్ 25 కేవీ ఏసీ విద్యుత్ సరఫరా, సబ్ సెక్షన్ ఎలక్ట్రికల్ ట్రాక్షన్‌ను గురువారం డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్‌తోపాటు ఎన్‌ఎండీసీ స్టీల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తన్మయ్ ముఖోపాధ్యాయ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌ఎండీసీ స్టీల్ లిమిటెడ్‌కు ప్రధాన లాజిస్టిక్ ప్రొవైడర్‌గా వాల్తేరు డివిజన్ నిలుస్తోందన్నారు. ఎలక్ట్రికల్ ట్రాక్షన్ అందుబాటులోకి రావడం ద్వారా గత ఏడాది అక్టోబరులో కార్యకలాపాలు ప్రారంభించిన నాగర్నార్ స్టీల్‌ప్లాంట్‌లో ఎక్కువ రేక్‌లను నడపడం ద్వారా ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం శివానందప్రసాద్, ఎన్‌ఎండీసీ స్టీల్ లిమిటెడ్ అధికారులు, నాగర్నార్ ప్లాంట్ ప్రతినిధులు, వాల్తేరు డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

మన దేశానిది పటిష్ఠ ఆర్థిక వ్యవస్థ


సహకార జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా సహకార శాఖాధికారి టి ప్రవీణ

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే పటిష్ఠ ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా భారత్‌కు గుర్తింపు ఉందని జిల్లా సహకార శాఖాధికారి టి.ప్రవీణ అన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మర్రిపాలెం కార్యాలయంలో నిర్వహించిన సహకార వారోత్సవాల్లో ఆమె పాల్గొని సహకార జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ఆర్థికవృద్ధి సాధనకు కృషి జరుగుతోందన్నారు. బ్యాంక్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డీవీఎస్ వర్మ మాట్లాడుతూ కేంద్రస్థాయిలో సహకార మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి, అన్ని సహకార సంఘాలను కంప్యూటరీకరించడం ద్వారా సహకార సంస్థల వ్యాపారాన్ని సులభతరం చేస్తారన్నారు. బ్యాంక్ జీఎం బి శ్రీనివాసరావు, డీజీఎం ఎం.అశోక్‌కుమార్, ఏజీఎం ఎం.శ్రీనివాసరావు, బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

15 మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

గండిగుండం నుంచి విజయనగరం జిల్లా చింతలపాలెం (అరకు రోడ్డు) వరకూ ప్రస్తుతం ఉన్న రహదారిని 80 అడుగులకు విస్తరించడానికి 6.4 కి.మీ.కు రూ.40.09 కోట్లు ఖర్చు చేయనున్నారు. భోగాపురం మండలం మోపాడ నుంచి నవరవల్లి వరకూ 100 అడుగుల మేర 6.3 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.37.8 కోట్లు ఖర్చు చేస్తారు. విజయనగరం జిల్లా బొడ్డవలసలో అయినాడ జంక్షన్ నుంచి విజయనగరం రింగ్ రోడ్డు ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వరకు 80 అడుగులకు విస్తరించడానికి రూ.32.5 కోట్లు అవసరమని అంచనా వేశారు.

ప్రాధాన్యం ప్రకారం పనులు

భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైతే జాతీయ రహదారి, భీమిలి బీచ్ కారిడార్‌లో పెరిగే రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశాం. వీటిని దశల వారీగా జీవీఎంసీతో కలిసి నిర్మిస్తాం. అన్ని శాఖ సహకారం తీసుకుంటాం.

-భవానీ శంకర్, సీఈ, వీఎంఆర్‌డీఏ

మద్దిలపాలెంలో అక్రమ నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

దేవి హోమ్స్ ఎదురుగా గల ఇరుకు రోడ్డులో సుమారు 500 గజాల స్థలంలో భారీ భవనం నిర్మిస్తున్నారు. నిబంధనల ప్రకారం 30 అడుగుల రోడ్డులో 600 గజాలలోపు స్థలాల్లో ముందు పది అడుగులు, మిగతా మూడు వైపులా ఆరున్నర అడుగులు మేర సెట్ బ్యాక్స్ విడిచిపెట్టి నిర్మాణం చేపట్టాలి. అదే చిన్న రోడ్డు అయితే ముందు ఇంకా ఎక్కువ స్థలం వదలాల్సి ఉంటుంది. దేవీ హోమ్స్ ఎదురుగా గల రహదారిలో నిర్మాణదారుడు ఒక్క అడుగు సెట్ బ్యాక్ కూడా వదలకుండా నిర్మాణం చేస్తున్నారు. అలాగే బహుళ అంతస్థుల భవనాల చుట్టూ కచ్చితంగా వాహనం తిరిగేంత స్థలం విడిచిపెట్టాలి. పొరపాటున అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఫైర్ ఇంజన్ తిరగడానికి, నివాసులకు రక్షించేందుకు ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా ప్లాన్ మంజూరుచేస్తారు. అయితే సదరు నిర్మాణదారుడు ఇవేమీ పట్టించుకోకుండా స్థలం మొత్తంలో భవనాన్ని నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారుడు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆ నిర్మాణానికి కూతవేటు దూరంలోనే సచివాలయం ఉంది. టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి అక్రమ నిర్మాణాలను గుర్తించి అధికారుల దృష్టిలో పెట్టాలి. స్థానిక వైసీపీ నాయకుడి అండతోనే స్థల యజమాని దర్జాగా అక్రమ నిర్మాణం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అందుకే సచివాలయ సిబ్బంది చూసీచూడనట్టు ఊరుకున్నారని అంటున్నారు. అంతేకాకుండా జీవీఎంసీ ప్లాన్ కాపీ జెరాక్స్ నిర్మాణం వద్ద ప్రదర్శించాలి. అటువంటిదేమీ లేకుండా నిర్మాణం చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చోద్యం చూస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో నర్సింగ్ విద్యార్థినికి తీవ్రగాయాలు


సెవెన్ హిల్స్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ హాస్టల్‌లో విద్యార్థిని దూకిన కిటికీ

సీతంపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తూ విద్యుత్ తీగలు తగిలి నర్సింగ్ విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి సంగం శరత్ సినిమా థియేటర్ వెనుక గల సెవెన్ హిల్స్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ హాస్టల్‌లో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సెవెన్ హిల్స్ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌లో పశ్చిమబెంగాల్‌కు చెందిన స్నేహదాస్ (20) పది నెలల క్రితం చేరింది. ఆమెకు సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్తిక్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఈ నెల 12న అర్ధరాత్రి దాటాక సుమారు 2 గంటల సమయంలో స్నేహదాస్ తన స్నేహితుడు సుశాంత్‌కు ఫోను చేసి స్కూల్ వద్దకు రమ్మంది. దీంతో కార్తిక్ అక్కడకు బిరియానీ ప్యాకెట్‌తో వచ్చాడు. మూడో అంతస్తులో ఉంటున్న స్నేహదాస్, స్నేహితురాలు సాహేలితో కలిసి చప్పుడు చేయకుండా కిందికి దిగింది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న అద్దాల కిటికీ నుంచి బయటకు దూకింది. స్కూల్ ప్రహరీ నుంచి బయటకు వెళ్లేందుకు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మ ఎక్కడానికి ప్రయత్నించింది. ఈ తరుణంలో ప్రమాదవశాత్తూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కి ఉన్న తీగలు తగిలి షాక్ తగిలి కింద పడిపోయింది. దీంతో పెద్ద శబ్దం వచ్చి మొత్తం విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు, లోపల పడుకుని ఉన్న మేట్రన్ సత్యవతి బయటకు వచ్చి చూసేసరికి స్నేహదాస్ కిందపడి కాలిపోయి ఉంది. గాయపడిన ఆమెను సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె కుడి వైపు మొత్తం శరీరం కాలింది. ప్రిన్సిపాల్ జి.గౌరి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ జి.గౌరిని వివరణ కోరగా స్నేహదాస్ ప్రవర్తన సరిగా లేదని, అక్టోబరులో ఫిర్యాదు చేశామని తెలిపారు.

సదరం... గందరగోళం

... 5వ పేజీ తరువాయి

ప్రతి నెలా స్లాట్ బుకింగ్ సమయం ఇచ్చేవారు. ఇటీవల రెండు నెలలకు ఒకేసారి స్లాట్లు ఇస్తున్నారు. అక్టోబరు, నవంబరు నెలల స్లాట్లు అక్టోబరులోనే ఇచ్చేశారు. అయితే ఈఎన్‌టీ, తదితర సమస్యలు ఉన్నవారికి సర్టిఫికెట్ల జారీలో పెద్దగా ఇబ్బంది లేదు. ఇతరత్రా సమస్యలు ఉన్నవారి సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల పొరుగునున్న జిల్లాల ఆస్పత్రులకు వెళ్లాల్సిందిగా సూచిస్తున్నారు. ఉదాహరణకు విశాఖ జిల్లాలో కేజీహెచ్ కావాలని చాలామంది ఆప్షన్ తీసుకుంటున్నారు. ఆ స్లాట్లు అయిపోగానే పక్కనే ఉన్న అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ఏరియా ఆస్పత్రులలో ఖాళీ స్లాట్లు ఉన్నాయని, అక్కడకు వెళ్లవచ్చునని సచివాలయాల సిబ్బంది సూచిస్తున్నారు. సర్టిఫికెట్లు అత్యవసరంగా కావాలనుకునేవారు దూరాభారం అయినా తప్పనిసరై అక్కడకు వెళుతున్నారు. 100 శాతం వైకల్యం కలిగిన వారికి సహాయంగా మరొకరు అంతదూరం వెళ్లాల్సి వస్తోంది. ఈ సమస్య పెద్ద జిల్లాల్లో ఎక్కువగా ఉన్నందున దీనికి పరిష్కారం చూపించాల్సి ఉంది.

ఇటీవల డాబాగార్డెన్స్‌కు చెందిన ఓ మహిళ సదరం స్లాట్ కావాలని సచివాలయానికి వెళితే...కేజీహెచ్‌లో లేదని అనకాపల్లి వెళ్లాలని సూచించారు. అలాగే మరికొందరికి పాడేరు, నర్సీపట్నం వెళ్లాల్సిందిగా చెబుతున్నారు. విశాఖలో స్లాట్లు ఖాళీ లేనందునే పక్కనే ఉన్న ఏరియా ఆస్పత్రులను సూచిస్తున్నామని, వారికి ఇష్టం లేకపోతే విశాఖలో స్లాటు దొరికే వరకు వేచి ఉండవచ్చునని, అందులో బలవంతం ఏమీ ఉండదని సిబ్బంది చెబుతున్నారు. దీనికి అధికారులు ఏ విధంగా పరిష్కారం చూపిస్తారో చూడాల్సి ఉంది.

'ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం'


ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం నేత జగ్గునాయుడు

సీతమ్మధార, నవంబరు 14: (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రిచడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విమర్శించారు. విద్యుత్ ట్రూ అప్, ఇంధన చార్జీలు వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధరలు తగ్గించడం, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం, మహిళలకు రక్షణ, యువతకు ఉపాధి డిమాండ్లతో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గునాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీని అమలు చేయకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వ రేషన్ డిపోల ద్వారా నాణ్యమైన బియ్యం, 16 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌ట్రూ అప్ చార్జీలు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేత డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మికులను తొలగించడానికి మోదీ ప్రభుత్వం పూనుకుంటే కూటమి నాయకులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. విశాఖకు వచ్చిన చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌లు రుషికొండ ప్యాలెస్ చుట్టూ తిరిగారే తప్ప స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అనంతరం అర్బన్ తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.మణి, ఎం.సుబ్బారావు, యుఎస్ఎన్ రాజు, వి.నరేంద్ర కుమార్, వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై ఎన్‌సీసీ కేడెట్లకు అవగాహన

మహారాణిపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణపై ట్రాఫిక్ పోలీసులు ఓమ్ని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్లకు గురువారం అవగాహన కల్పించారు. ఓమ్ని ఆసుపత్రి తన సామాజిక బాధ్యతలో భాగంగా బీచ్ రోడ్డు, మహారాణిపేట, జిల్లా పరిషత్ జంక్షన్, జైల్‌రోడ్డు, రామ్‌నగర్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో అవగాహన కల్పించారు. యువత ప్రమాదాల్లో నిండు ప్రాణాలు కోల్పోతూ తల్లిదండ్రులకు గర్భశోకాన్ని, కుటుంబాలకు వేదన మిగులుస్తున్నారని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడమే ఇందుకు కారణమన్నారు. ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్లు, కార్లలో వెళ్లినప్పుడు సీటుబెల్టులు ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని, పరిమితికి మించి వెళ్లడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని వివరించారు. కొందరికి హెల్త్ చెకప్ కూపన్లు అందజేశారు. ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

నైవేద్యానికి నోచుకోని నారాయణుడు!

... 5వ పేజీ తరువాయి

శ్రీకృష్ణదేవరాయలు విజయస్థూపాన్ని ఏర్పాటుచేయగా దానిని, వైకుంఠ నారాయణుని ఆలయాన్ని కలుపుతూ ప్రత్యేక టూరిజం వ్యవస్థను నెలకొలుపుతామంటూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన ప్రస్తుత భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. అది కూడా నేటి వరకూ కార్యరూపం దాల్చలేదు. దాంతో ఆలయాన్ని, విజయస్థూపాన్ని చూసే భాగ్యం భక్తులకు లభించడం లేదు. ఆ ప్రాంతానికి వెళ్లే మార్గం కూడా చాలావరకు రాళ్లు తేలి ఇబ్బందికరంగా మారింది. దేవదాయ శాఖ అధికారులు ఇప్పటికైనా ఆ ప్రాంత అభివృద్ధిపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

సికింద్రాబాద్-లక్నో మధ్య ప్రత్యేక రైలు

... 5వ పేజీ తరువాయి

చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07083 నంబరు గల రైలు ఈ నెల 18, 25 తేదీల్లో (సోమవారం) ఉదయం 9.50 గంటలకు లక్నోలో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 1.30 గంటలకు (మంగళవారం అర్ధరాత్రి) దువ్వాడ చేరి, తిరిగి ఇక్కడ నుంచి 1.32 గంటలకు బయలుదేరి అదేరోజు (బుధవారం) మధ్యాహ్నం 3.00 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు నల్గొండ, విజయవాడ, భువనేశ్వర్, వారణాసి, అయోధ్య మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ఉత్సాహంగా బాలల దినోత్సవం



వాగ్దేవి పాఠశాలలో నృత్యం చేస్తున్న చిన్నారులు


జనసేన కార్యాలయంలో నెహ్రూ చిత్రపటం వద్ద చిన్నారులు, నాయకులు

అక్కయ్యపాలెం/అల్లిపురం/డాబాగార్డెన్స్/సీతంపేట/నవంబరు14 (ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం బాలల దినోత్సవాన్ని వివిధ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. బాలలు విచిత్ర వేషధారణలు, నృత్యాలతో అలరించారు. ఉపాధ్యాయులు, అతిథులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోర్టు ఆసుపత్రి ఎదురుగా నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన అన్నదాన ట్రస్ట్ ప్రతినిధులు బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. రాజేంద్రనగర్‌లోని జనసేన నగర పార్టీ కార్యాలయంలో బాలల దినోత్సవాన్ని 27వ వార్డు అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో ప్రిన్సిపల్ కమల్‌జిత్ మాట్లాడుతూ ఈతరం పిల్లల పెంపకానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అవగాహనతో ఉండాలన్నారు. జిల్లాలో 85 ప్రాంతాల్లో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహించినట్లు కన్వీనర్ కె.సుశీల తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్స్ , సీనియర్స్ విభాగాల్లో డ్రాయింగ్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్, మ్యూజికల్ చైర్, సీనియర్స్‌కు కబడ్డీ తదితర పోటీలు నిర్వహించామన్నారు. 26వ వార్డు శంకువానిపాలెంలోని వాగ్దేవి పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ హాజరయ్యారు. మహనీయుల ఆశయాలు, ఆలోచనలను విద్యార్థులు అలవరుచుకోవాలని భీమ్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మార్టూరులో నేత్రపర్వంగా దుర్గాలమ్మ పండుగ



అమ్మవారిని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్

తుమ్మపాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం మార్టూరులో గ్రామ దేవత దుర్గాలమ్మ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి అమ్మవారికి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ అమ్మవారిని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటైంది. నిర్వాహకులతో పాటు గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవంలో పెద్దలకు సత్కారం



పెద్దలను సన్మానించిన ఉత్సవ కమిటీ నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి గవరపాలెంలో వినాయక గౌరీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీలావారి గౌరీ పరమేశ్వరుల మహోత్సవంలో భాగంగా స్థానిక పెద్దలైన కొణతాల అప్పలనాయుడు, దాడి అప్పలనాయుడు, మళ్ల చిన్న అప్పారావు, బుద్ద రామకృష్ణ, డాక్టర్ జి.రామ్మూర్తి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు బుధవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ప్రతియేటా ఈ వేడుకల్లో పెద్దలను సత్కరిస్తుండడం ఆనవాయతీ. ఆలయ గౌరవాధ్యక్షులు కొణతాల రఘునాథ్, శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరాహా నూకరాజు, అధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు, కోశాధికారి భీమరశెట్టి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు మారిశెట్టి జగన్నాథరావు, జాయింట్ సెక్రటరీ దాడి రామకృష్ణ, బుద్ద శ్రీనివాసరావు, భీమరశెట్టి మహాలక్ష్మినాయుడు, కొణతాల కృష్ణ, బుద్ద శివ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ఫార్మా వ్యర్థాలతో ఊర చెరువు నీరు కలుషితం'

పరవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో గల ఊర చెరువులో ఫార్మా వ్యర్థాలు కలవనీయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. ఇటీవల ఫార్మా వ్యర్థాలను ఈ చెరువులోకి విడిచి పెట్టడంతో నీరంతా నల్లగా మారి దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. రాంకీ, ఫార్మా యాజమాన్యాలు కుమ్మక్కై, ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా గెడ్డల ద్వారా చెరువులోకి విడిచి పెడుతుండడంతో ఈ సమస్య ఏర్పడినట్టు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా భూగర్భ జలాలు కలుషితమై రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టనట్టు వ్యవహరిండడం తగదన్నారు. ఫార్మా వ్యర్థ జలాల కట్టడికి చర్యలు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని రైతులు బండారు చిన్నంనాయుడు, పైలా బుజ్జి గురువారం తెలిపారు.

మధుమేహ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ లావణ్య

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మధుమేహ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ ఆయుష్ వైద్యురాలు కె.లావణ్య సూచించారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ వైద్యాలయంలోని ఆయుష్ విభాగంలో గురువారం ఏర్పాటైన సదస్సులో మాట్లాడారు. మధుమేహం రావడానికి గల కారణాలు, జీవనశైలిలో కలిగే మార్పులు, తీసుకోవాల్సిన ఆహారం తదితరాలను ఆమె వివరించారు. అనంతరం ఆయుర్వేద యోగా నిపుణురాలు చంద్రిక, యోగా అభ్యాసకులు పెంటకోట శ్రీనివాసరావు మధుమేహాన్ని నియంత్రించే ఆసనాలు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు.

గుల్లేపల్లిలో 'సూర్య ఘర్ యోజన'పై అవగాహన సదస్సు



పథకానికి సంబంధించి పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

సబ్బవరం, నవంబరు 14 : కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సోలార్ విద్యుత్ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి పిలుపునిచ్చారు. మండలంలోని గుల్లేపల్లిలో ఏపీ ఈపీడీసీఎల్ ఏడీఈ నిరంజన్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన గురువారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటే భవిష్యత్తు తరాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఏఈడీ మాట్లాడుతూ సూర్య ఘర్ యోజన పథకం ఏ విధంగా వినియోగించుకోవాలో వివరించారు. అనంతరం ఇందుకు సంబధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రంలో ఎంపీడీవో పి.పద్మజ, సర్పంచ్ బండారు మంగ, బోకం రాము నాయుడు, బండారు శ్రీను, ఏఈలు అశోక్, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతి

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అదృశ్యమైన వృద్ధుడు మృతి చెం దినట్టు ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక నరసింగరావుపేట దుర్గాలమ్మ వీధిలో ఉం టున్న అద్దంకి శ్రీనివాసరావు (72) బుధవారం తెల్లవారుజామున అదృశ్యమైన విషయం తెలి సిందే. కుటుంబ సభ్యులు గురువారం వెతుకుతుండగా చినబాబు కాలనీలోని జీవీఎంసీ ప్రధాన మంచినీటి సరఫరా కేంద్రం సమీపంలో మృతి చెంది ఉండడాన్ని గుర్తించినట్టు ఎస్ఐ చెప్పారు.



అనకాపల్లి బీసీ బాలుర వసతి గృహంలో బాలల దినోత్సవం



బాలికోన్నత పాఠశాలలో...



పరవాడలోని పాఠశాలలో విద్యార్థుల వేషధారణలు

పాఠశాలల్లో 'బాలల' పండుగ

▸▸ నెహ్రూ చిత్ర పటాలు, విగ్రహాలకు నివాళులర్పించిన అతిథులు ▸▸ వివిధ వేషధారణలతో అలరించిన విద్యార్థులు

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ జయంతిని గురువారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అబ్దుల్ కలామ్ సేవా సంఘం చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇక్కడి గాంధీనగరం బీసీ బాలుర వసతిగృహం, జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మాజీ, రమణ, కాండ్రేగుల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ పట్టణ బాలికోన్నత పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి హెచ్ఎం కె.రధిర రాణి, ఎస్ఎంసీ చైర్మన్ ప్రసాద్, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. నెహ్రూచౌక్‌లో నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు, కాళ్ల సత్యనారాయణ, పీఎస్ దత్తు, బోయిన భానుమూర్తి యాదవ్, బుద్ద కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో గల పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ బాలలు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా నెరవేర్చాలన్నారు. మంచి పౌరులుగా సమాజానికి ఉపయోగపడాలన్నారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హెచ్‌బీ శ్రీదర్, ఉపాధ్యాయులు బాబు, వసంతరావు, సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, లక్ష్మి, కరుణజ్యోతి, శైలజా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మామిడిపాలెం పాఠశాలలో నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పరవాడ : బాలల దినోత్సవాన్ని వాడవాడలా ఉత్సాహ భరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. పి.బోనంగిలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో తొలుత జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలల దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు ఆమె వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళలర్పించారు. స్థానిక ప్రతిభ విద్యాలయంలో విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ ఆన్సీజోషెఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికలతోనే సుస్థిర అభివృద్ధి

▸▸ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల సమావేశంలో డీపీవో శిరీషారాణి



ప్రజాప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి

సబ్బవరం, నవంబరు 14 : ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారిణి ఆర్.శిరీషారాణి అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి- ప్రణాళికలపై ప్రజాప్రతినిధులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను గుర్తించాలన్నారు. గుర్తించిన ప్రతి పనిఆన్‌లైన్ చేయాలని ఆమె సూచించారు. ఆన్‌లైన్ చేయని పనులకు నిధులు మంజూరు కావాని స్పష్టం చేశారు. డీపీఆర్‌సీ నాగలక్ష్మి మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయడంతో ఆటు గ్రామాల అభివృద్ధికి సహకరించాల్సిందిగా కోరారు.ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ, ఏవో శివరామప్రసాద్, ఈవోపీఆర్‌డీ బి.చైతన్య, ఏపీఈపీడీసీఎల్ ఏడీ నిరంజన్ అంబేడ్కర్, వ్యవసాధికారి పోతల సత్యనారాయణ, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో గల 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ.బోనంగి, గొర్లెవానిపాలెం, పి.బోనంగి, గొల్లలపాలెం, కలపాక గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

'ఎండీయూ ఆపరేటర్ల పై చర్యలు తీసుకోవాలి'



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ భద్రం

తుమ్మపాల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : చౌక డిపోల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న కందిపప్పును అందించకుండా లబ్ధిదారులను తప్పుదోవ పట్టించిన ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎస్ భద్రం కోరారు. గురువారం ఇక్కడి సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిపో నంబరు 10, 17లలో లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని కందిపప్పు ఇవ్వలేదన్నారు. ఎండీయూ ఆపరేటర్లు, డిపో డీలర్లు మిలాఖత్ అయి బ్లాక్ మార్కెట్‌లో కందిపప్పును అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీనిపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కోరిబిల్లి శంకరరావు, అబ్బులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన అవసరం



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏవో సత్యనారాయణ

సబ్బవరం, నవంబరు 14 : సమాచార హక్కు చట్టంపై పౌరులంతా అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు చట్టంపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సహకారంతో పనిచేస్తున్న సంస్థల్లో జరిగే కార్యక్రమాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డీ చైతన్య, ఏవో శివరామప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల భాగస్వామ్యంతో సహకార రంగం బలోపేతం



వారోత్సవాల్లో మాట్లాడుతున్న సహకార అధికారిణి కిరణ్‌కుమారి

సబ్బవరం, నవంబరు 14 : రైతుల భాగస్వామ్యంతోనే సహకార రంగం అభివృద్ధి సాధ్యమని డివిజనల్ సహకార అధికారిణి కిరణ్‌కుమారి అన్నారు. ఇక్కడి పీఏసీఎస్ ఆవరణలో గురువారం జరిగిన అఖిల భారత సహకార వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా మాట్లాడారు. సహకార రంగం అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సంస్థ అభివృద్ధిలో రైతులతో పాటు సిబ్బంది, సభ్యులు పాత్ర ఎంతో ఉందన్నారు. కంప్యూటరీ కరణ ద్వారా రైతులకు పారదర్శకంగా సేవలు అం దించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘం పర్సన్ ఇన్‌చార్జి వీపీఎస్ శాస్త్రి, సహకార విద్యాధికారి జి.సోమేశ్వరరావు, సీఈవో గొంప రమణ, సంఘ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని 108 సిబ్బంది వినతి



మండల పరిషత్ కార్యాలయ ఏవోకు వినతిని అందిస్తున్న సిబ్బంది

సబ్బవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 సిబ్బంది గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ అధికారి శివరామప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.అప్పారావులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108ను ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. వేతనా శ్లాబ్‌ను అప్‌డేట్ చేసి పెంచాలని, ఎరియర్స్‌తో కలిపి పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలంగా అంకిత భావంతో పనిచేస్తున్న తమ సేవలను ప్రభుత్వం గుర్తించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జి.సంజీవరావు, కె.సతీష్, ఎ.శ్రీనివాసరావు, ఇంద్రమరణ, సూరిబాబు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలు తగ్గించాలని సీపీఎం ధర్నా



అనకాపల్లిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపోరు యాత్రలో భాగంగా సీపీఎం అనకాపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే తగ్గించాలని, రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరకులను సరసమైన ధరలకు ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ఎన్నికల్లో మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని కోరారు. పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలను నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ఆందోళనలో నాయకులు గంటా శ్రీరామ్, కె.తేలయ్యబాబు, కె.ఈశ్వరరావు, పి.చలపతి, సుభాషిణి, అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఆ పార్టీ నాయకురాలు పి.మాణిక్యం తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పరవాడ బీసీ కాలనీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని అంటుతుండడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరమ్మ, అప్పలనర్స లక్ష్మి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: పెరుగుతున్న నిత్యావసరాల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఇక్కడి తహసీల్దార్ బి.చిన్నికృష్ణకు గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి బి.ప్రభావతి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జమిలీ ఎన్నికలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టాలని, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవ కాశాలు కల్పించాలని, పిల్లలు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి, నాయకులు ఎం.గౌరీశరావు తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న పార్టీ ప్రతినిధులు

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



అనకాపల్లిలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న సబ్ జైలు అధికారి

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సబ్‌జైలు పర్యవేక్షణ అధికారి డి.అనిల్‌కుమార్ ప్రారంభించారు. ముందుగా మాజీ ప్రధాని దివంగత జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కీర్తించారు. వారోత్సవాల ప్రోగ్రాం చైర్మన్ బల్లా నాగభూషణం మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జీఎల్ఎన్ శాస్త్రి, కొణతాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పద్య కవి కాండ్రేగుల వెంకటరావు, గ్రంథాలయాధికారి కె.వి.లక్ష్మణరావు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. నెహ్రూ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీ నాగేశ్వరరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరవాడలో...

తుమ్మపాల : ఇక్కడి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా హైస్కూల్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పి.బలరాం మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానానికి నిలయాలుగా పేర్కొన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులు ప్రతిరోజూ వీటిని సందర్శిస్తే విజ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కొణతాల నరసింగరావు, ఉపాధ్యాయులు ఏవీవీ సత్యనారాయణ, రమణి, శివాజీ, మురళీ, కె.లక్ష్మీనారాయణ, సింహాచలం, ఆదారి నారాయణమూర్తి, కె.జగన్, గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తుమ్మపాల గ్రంథాలయంలో మాట్లాడుతున్న బలరాం

వన భోజనాలకు వేళాయె...

ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఆనవాయితీ

కార్తీక మాసంలో ఇదో సత్సంప్రదాయం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సంఘ జీవనం భారతీయ సంస్కృతి. ఆచార సంప్రదాయాలు నేర్పింది ఈ సంఘ జీవనమే. పరస్పర సహకారం, సామూహిక సమ్మేళనాలు ఐక్యత, అభివృద్ధికి నాంది పలుకుతాయి. ఆధ్యాత్మిక, అనుబంధాల సమ్మేళనమే వనభోజనాలు. కార్తీక మాసం వచ్చిందంటే ఎవరికైనా టక్కున గుర్తుకు వచ్చేవి ఇవే. వన సమారాధనకు (పిక్నిక్‌లు) పురాణాల్లో ఎంతో ప్రాశస్త్యం ఉంది. ఉరుకులు పరుగులే జీవితంగా మారిన ప్రస్తుత జీవన గమనంలో కాసింతైనా మనసుకు ఆహ్లాదం కలిగించే కార్యక్రమాల్లో వనభోజనాలు ఒకటని కచ్చితంగా చెప్పొచ్చు. వృత్తి ఉద్యోగాలతో బిజీగా ఉండే దంపతులకు, పుస్తకాలతో కుస్తీపట్టే పిల్లలకు ఓ ఆటవిడుపు. రోజంతా తమకు తెలియకుండా గడిచిపోయే వనభోజనాల కోసం జనం అందుకే అంత ఆసక్తిగా ఎదురుచూస్తారు. అనుబంధాలు చెరిగిపోయి... మమకారాలు కరిగిపోయిన ఈతరంలో కనీసం వన సమారాధన రోజైనా వాటిని మొగ్గతొడిగిస్తే కొంతలో కొంతైనా మేలు జరుగుతుంది.



హైందవ విశ్వాసాల్లో కార్తీక మాసానికి అగ్రస్థానం ఉంది. హరిహరాదులు ఇద్దరినీ పూజించే పవిత్ర మాసం ఇది. కార్తీక మాసంలో పూజలకు ఎంత ప్రాధాన్యం ఉందో వన భోజనాలకు అంతే ప్రాధాన్యం ఉంది. దేవతలు వనాల్లో విహరిస్తుంటారట. చెట్లపై కొలువుదీరుతారట. ఆలయాలు, క్షేత్రాలో కొండకోనల్లో వెలియడానికి కారణం కూడా ఆ ప్రాంతాలకు ముచ్చటపడిన దేవతలు అక్కడ కొలువుదీరాలని కోరుకోవడం వల్లే అంటారు. కార్తీక మాసంలో ఉసిరి చెట్టును శ్రీమహావిష్ణువుగా భావిస్తారు. దానికింద భోజనం చేస్తే పుణ్యఫలం లభిస్తుందని నమ్ముతారు. విశ్వాసం, నమ్మకం అనే పునాదులపై అనాదిగా కొనసాగుతున్న సంప్రదాయం ఇది. ఎన్నో ఔషధ గుణాలున్న ఉసిరి చెట్టు కింద సామూహిక వనభోజనాలు చేస్తే పుణ్యఫలం దక్కుతుందని పురాణేతిహాసాలు పేర్కొంటున్నాయి. అనేక ధార్మిక గ్రంథాల్లోనూ కార్తీక వనభోజనాల ప్రస్తావన ఉంది. మహర్షులు కూడా దీన్ని ఆచరించినట్లు చెబుతారు. అంతటి విశిష్టత, ప్రాధాన్యం ఈ తరంలో లేకపోయినా సంప్రదాయం ఏదో రూపంలో కొనసాగుతుండడం సంతోషించాల్సిన విషయం. అడవులు అంతరించిపోతున్న ఈ రోజుల్లో ఉసిరి చెట్లు కొరత ఉండడంతో ఏదో ఒక చెట్టు కింద సంప్రదాయాన్ని పూర్తిచేస్తున్నారు. సమగ్రత, సమైక్యతకు చిహ్నంగా చెప్పుకునే వనభోజనాలపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

ఉసిరి చెట్టే కాదు...అన్నీ వేదికలే

ఉసిరి చెట్టును శ్రీమహావిష్ణువుగా భావిస్తారు. అందుకే కార్తీక మాసంలో ఒక్కరోజైనా ఉసిరి చెట్టు కింద భోజనం చేస్తే ఆ దేవదేవుని అనుగ్రహం లభిస్తుందన్నది ఆధ్యాత్మిక వాదుల నమ్మకం. అంత మాత్రాన ఉసిరి చెట్టు లేకపోతే ఫలితం ఉండదనుకోనక్కర్లేదు. ఎవరి అభీష్టం మేరకు వారు నచ్చిన ప్రదేశాలను ఎంచుకుని కార్యక్రమాన్ని పూర్తి చేయవచ్చునంటున్నారు. కొందరు ఉద్యానవనాల్లో పిక్నిక్‌లకు ప్రాధాన్యం ఇస్తారు. మరికొందరు నదుల వద్ద, ఇంకొందరు సముద్ర తీరాల్లో జరుపుకుంటారు. తోటలు అందుబాటులో ఉన్న వారు ఆయా ప్రదేశాల్లో పిక్నిక్‌లు జరుపుకుంటుంటారు. విశాఖ లాంటి నగరాల్లో పర్యాటక



వనభోజనాల్లో కుటుంబ సభ్యులు

ప్రదేశాలే అతిపెద్ద పిక్నిక్ స్పాట్‌లుగా ఉన్నాయి.

ఆధ్యాత్మిక చింతనతో...

వనభోజనాలు ఆధ్యాత్మిక చింతనతోపాటు హైందవ ధర్మాన్ని చాటిచెబుతాయి. వన సమారాధన వల్ల ఆయుర్వేదంలో వృక్ష జాతికున్న విశిష్టత అందరికీ తెలుస్తుందని చెబుతారు. వండిన ఆహారాన్ని మహావిష్ణువుకు ప్రీతి అయిన ఉసిరి చెట్టు కింద తింటే మంచి ప్రతిఫలం ఉంటుందట. ఈ కారణంతోనే సామూహిక వనభోజనాలు

పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

పిల్లలతో పిక్నిక్‌కు వెళితే చాలా అప్రమత్తంగా ఉండాలి. వారు స్వేచ్ఛగా ఆడుకునే అవకాశం ఇస్తూనే ఓ కంట గమనిస్తుండాలి. జలాశయాలు, సాగర తీరం వద్ద పిక్నిక్ అయితే అత్యంత అప్రమ త్తంగా వ్యవహరించాలి. జలపాతాల్లోనూ, సముద్రంలోనూ ఆటలు వద్దు. పిల్లల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వదిలేయవద్దు వెంటే ఒకరు ఉండాలి.

- ఉసిరి చెట్టు కింద భోజనంతో ఎంతో ప్రయోజనం
- ఆధునిక యుగంలోనూ కొనసాగుతున్న విధానం

చేసే వారు ఇప్పటికీ ఉన్నారు. ప్రధానంగా దైవభక్తి, గ్రామీణ నేపథ్యం ఉన్నవారు ఇటువంటి సంప్రదాయాలను పాటిస్తున్నారు. వీరు మద్య, మాంసాహారం ముట్టుకోకుండా పిక్నిక్‌లు చేసుకుంటుంటారు. మారిన జనరేషన్‌లో ఇటువంటి వారిని వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. దీక్షలు చేసే స్వాములు భక్తి భావంతో పిక్నిక్‌లు నిర్వహించుకుంటారు.

ఆహారం విషయంలో...

ఆహారం విషయంలో చక్కగా ప్లాన్ చేసుకుంటే ఇబ్బంది ఉండదు. రద్దీ సమయాల్లో బయట ఆహారంతో ఇబ్బందులుంటాయి. ఇంటి వంటకాలకే ప్రాధాన్యం ఇస్తే మంచిది. కుటుంబాలు కలిసి వెళ్తున్నప్పుడు ఒక్కొక్కరూ ఒక్కో ఐటమ్ షేర్ చేసుకోవాలి. ఆహార పదార్థాలు హాట్ కంటైనర్లు, డిష్‌ల్లో తీసుకు వెళితే వేడిగా, రుచిగా ఉంటాయి. ఆహారం వృథాకాకుండా సరిపడేలా ముందే ప్లాన్ చేసుకోవాలి. సరిపడే స్థాయిలో మంచినీరు తీసుకువెళ్లాలి.

ముందస్తు ప్రణాళిక అవసరం

వనభోజనాల్లో రోజంతా ఆనందోత్సాహాలతో గడిపి మధురానుభూతిని సొంతం చేసుకోవాలంటే ముందస్తు ప్రణాళిక తప్పనిసరి. ఎంతమంది వెళ్తున్నారో పక్కాగా నిర్ణయించుకుని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలి. సొంత వాహనమా, ఆర్టీసీ బస్సా అన్నది ముందుగానే నిర్ణయించుకుని ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలి. వెళ్లే ప్రాంతంపై పూర్తి అవగాహన ఉండాలి. అక్కడి సదుపాయాలపై ఆరాతీయాలి. గతంలో వెళ్లే ప్రాంతం కంటే కొత్త ప్రదేశాన్ని ఎంచుకుంటే మంచిది. బడ్జెట్‌కు అనుగుణమైన ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి. రాత్రిపూట చూడాల్సిన అందాలుంటే తప్ప చీకటి పడకముందే తిరుగు ప్రయాణం కావాలి. ఉదయం వేగంగా వెళితే ఎక్కువసేపు



ఉసిరిచెట్టుకు పూజలు

గడిపామన్న ఆనందం కలుగుతుంది. నీడనిచ్చే ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవాలి.

సెల్‌ఫోన్లు కాసేపు పక్కన పెట్టాలి

మనుషుల మధ్య అంతరాన్ని అనుబంధాలు, ఆత్మీయతలు చెరిపేస్తాయి. కానీ ఈతరం మధ్య దూరాన్ని పెంచేవి సెల్‌ఫోన్‌లు. సామాజిక మాధ్యమాల పరంగా దగ్గరగా ఉంటున్నామని కొందరు గొప్పలు చెప్పుకుంటే చెప్పుకోవచ్చుగాని భావోద్వేగాల పరంగా వారి మధ్య దూరం పెరుగుతోంది. ఒకే ఇంట్లో ఉన్నా తల్లీకూతురు, తండ్రీ కొడుకు, భార్యాభర్త కలిసి ఆప్యాయంగా మాట్లాడుకునే సందర్భాలు అరుదవుతున్నాయి. సామాజిక మాధ్యమాలు పూర్తిగా సమయాన్ని ఆవిరి చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వనభోజనాల సమయంలోనైనా మొబైళ్లను పక్కనపెట్టడం వల్ల ఒకరి అభిప్రాయాలు మరొకరితో పంచుకునే వీలు కలుగుతుంది. వనభోజనాల రోజూ మొబైళ్లను నమ్ముకుంటే ఇక సందడి పోయినట్టే.

సికింద్రాబాద్- లఖ్‌నవు మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా సికింద్రాబాద్-లఖ్‌నవు మధ్య ప్రత్యేక రైలు సర్వీస్ ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 07084 నంబరు గల రైలు ఈనెల 15, 22 తేదీల్లో రాత్రి 7.05 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 5.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. ఇక్కడ నుంచి ఆదివారం సాయంత్రం 6.00 గంటలకు లఖ్‌నవు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07083 నంబరు గల రైలు ఈ నెల 18, 25 తేదీల్లో (సోమవారం) ఉదయం 9.50 గంటలకు లఖ్‌నవలో బయలుదేరి బుధవారం తెల్లవారుజామున 1.30 గంటలకు (మంగళవారం అర్ధరాత్రి) దువ్వాడ చేరి, తిరిగి ఇక్కడ నుంచి 1.32 గంటలకు బయలుదేరి అదేరోజు (బుధవారం) మధ్యాహ్నం 3.00 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు నల్గొండ, విజయవాడ, భువనేశ్వర్, వారణాసి, అయోధ్య మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

కొండచిలువను హతమార్చిన మహిళా కూలీలు



చంపేసిన భారీ కొండ చిలువను పట్టుకున్న మహిళలు

మాకవరపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమబోయిన పాలెంలో మహిళా కూలీలు భారీ కొండ చిలువను హతమార్చారు. గ్రామానికి సమీపంలోని కొండప్రాంతంలో ఉన్న భూముల్లో గురువారం మహిళలు తుప్పలు కొడుతున్నారు. ఈ క్రమంలో వారి భారీ కొండచిలువ కనిపించింది. దీంతో తమ వద్ద వున్న కర్రలతో కొండచిలువను కొట్టి చంపేశారు.

పది అడుగుల కొండచిలువ హతం

రావికమతం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.కొత్తూరు శివారు దిబ్బలూరులోని జీడిమామిడి తోటల్లో గురువారం కలుపుతీత, దుక్కిదున్నే పనులు చేస్తున్న రైతులు, కూలీలకు పది అడుగుల పొడవైన కొండచిలువ కనిపించింది. ప్రాణ భయంతో కొండచిలువను కొట్టి చంపేశారు.



హతమైన కొండ చిలువను చూపుతున్న రైతు

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

మెగా డీఎస్సీకి బీసీ స్టడీ సర్కిల్ ఉచిత శిక్షణ

అనకాపల్లి రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ మెగా డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు అనకాపల్లి ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి గురువారం ఒక ప్రకటన తెలిపారు. అనకాపల్లి జిల్లాకు చెందిన అర్హులైన వెనుకబడిన తరగతులు (బీసీ), షెడ్యూల్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్ తెగలు (ఎస్టీ), ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అభ్యర్థులు ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవలసి ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు రెండు నెలలకు స్టైపెండ్‌గా మూడు వేల రూపాయలు, వెయ్యి రూపాయలు విలువ చేసే స్టడీ మెటీరియల్ ఇస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి మార్కుల లిస్టు, ఇంటర్, డిగ్రీ మార్కుల లిస్టు, టీటీసీ, టెట్‌లో అర్హత సాధించిన మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూపాయల లోపు మాత్రమే), ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జెరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు జతపరచి ఈ నెల 18వ తేదీలోగా ఇంటి నంబరు 10-06-31/7, రఘురామ కాలనీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజి స్ట్రీట్, అనకాపల్లి, అనకాపల్లి జిల్లా చిరునామాలో గల కార్యాలయానికి నేరుగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు ఫోన్ నంబరు 9885845743కు సంప్రతించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



ధనుంజయ్ (ఫైల్ ఫొటో)

కొయ్యూరు, నవంబరు 14: మండలంలోని బకులూరు గ్రామ శివారు జీడిమామిడి తోటల్లో గురువారం అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించారు. అనంతరం కొయ్యూరు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కిశోర్‌వర్మ, పోలీసు సిబ్బంది కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహంపై కప్పిన జీడిమామిడి కొమ్మలు తొలగించి చూసిన పోలీసులు.. గూడెంకొత్తవీధి మండలం ఎర్రచెరువులు గ్రామానికి చెందిన బూసరి ధనుంజయ్‌దిగా గుర్తించారు. మృతదేహం ఉబ్బిపోయి దుర్వాసన వస్తుండడంతో మూడు, నాలుగు రోజుల క్రితం ఇతను మృతిచెందడం లేదా హత్యకు గురికావడం జరిగి వుంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఎర్రచెరువులు గ్రామానికి చెందిన బూసరి లక్ష్మయ్య కుమార్తె మాధవి, బకులూరుకు చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంది. ఈమె తమ్ముడు అయిన ధనుంజయ్ అక్కను చూసేందుకు వారం రోజుల క్రితం ఇక్కడకు వచ్చాడు. మద్యపానం అలవాటు వున్న ధనుంజయ్ 12వ తేదీ రాత్రి పది గంటల సమయంలో అక్క ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు. ఈ నేపథ్యంలో గురువారం జీడిమామిడి తోటల్లో శవమై కనిపించాడు. ధనుంజయ్‌ది హత్యా? ఆత్మహత్యా? సాధారణ మరణమా? అన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని కొయ్యూరు సీఐ వెంకటరమణ తెలిపారు.

వీఎంఆర్‌డీఏ కొత్త లేఅవుట్లు

... 5వ పేజీ తరువాయి

విక్రయం ద్వారా రూ.35 కోట్లు వస్తుందని అంచనా.

ఈ ప్రాజెక్టులను ఏడాది సమయంలోగా అభివృద్ధి చేసి ప్లాట్లను వేలానికి సిద్ధం చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. లేఅవుట్ల అభివృద్ధిలో భాగంగా బీటీ రహదారులు, విద్యుదీకరణ, పార్కుల నిర్మాణం, 60 అడుగుల రహదారులకు డివైడర్లు, సీసీ కాలువలు, కల్వర్టులు, ఎవెన్యూ ప్లాంటేషన్ చేయనున్నారు. ఈ ప్రతిపాదలన్నీ పురపాలక శాఖ ఆమోదం కోసం అమరావతి పంపించారు. ఆమోదం లభిస్తే టెండర్లు పిలిచి లేఅవుట్లు అభివృద్ధి చేస్తారు. ఆ తరువాత ప్లాట్లను వేలం ద్వారా విక్రయిస్తారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

... 5వ పేజీ తరువాయి

నిత్యకృత్యంగా మారాయి.

మల్టీ స్పెషాలిటీ పేరుతో...

జిల్లాలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు మల్టీ స్పెషాలిటీ వైద్య సేవల పేరుతో గ్రామీణుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో 'సూపర్' రేట్లు వసూలు చేస్తున్నారు. ఇక ప్రైవేటు క్లినిక్‌లు నిర్వహిస్తున్న కొంతమంది వైద్యులతో, ల్యాబ్‌ల నిర్వాహకులు కుమ్మక్కవుతున్నారు. అవసరం లేకపోయినా పలురకాల వైద్య పరీక్షలు చేయించి, భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ల్యాబ్ ఫీజుల్లో 20 నుంచి 40 శాతం వరకు ల్యాబ్ నిర్వాహకులు, సంబంధిత వైద్యులకు కమిషన్ రూపంలో పంపుతుంటారు. ప్రైవేటు ఆస్పత్రులు, లేబొరేటరీల నిర్వాహకులు అడ్డగోలుగా రోగులను దోచుకుంటుంటే వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

క్లిక్ చేస్తే ఖాతా ఖాళీ!

... 5వ పేజీ తరువాయి

కోరుతున్నారు. ఇటీవల అనకాపల్లి జిల్లా కలెక్టర్ పేరుతో కూడా సైబర్ నేరగాళ్లు కొంతమంది ఉన్నతాధికారులకు ఇదే మాదిరిగా వాట్సాప్ మెసేజ్‌లు వచ్చాయి. కొంతమంది అధికారులు ఆశ్చర్యపోయి, ఈ విషయమై నేరుగా కలెక్టర్‌తో మాట్లాడారు. దీంతో కలెక్టర్ తీవ్రంగా స్పందించి సైబర్ నేరగాళ్లపై పోలీస్ శాఖకు ఫిర్యాదు చేశారు.

బ్లాక్ మెయిలింగ్

హ్యాక్ చేసిన ఫోన్‌లో వున్న కుటుంబ సభ్యులు లేదా కాంటాక్ట్, మొబైల్ గ్యాలరీలో వున్న మహిళలు, కుటుంబ సభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి, తక్షణమే తమకు డబ్బు పంపాలని, లేకపోతే ఈ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని సైబర్ నేరగాళ్లు బెదిరిస్తున్నారు.

ట్రాయ్ సూచనలు పాటిస్తే..

- ట్రాయ్ మీ ఫోన్‌ను ఎలా డిస్‌కనెక్ట్ చేయబోతోంది అనే దాని గురించి ఎవరైనా కాల్ చేస్తే ప్రతిస్పందించవద్దు.
- ఫెడెక్స్ ద్వారా ప్యాకేజీ వచ్చిందని చెప్పి, '1' లేదా మరేదైనా నంబర్ నొక్కమని అడిగితే వెంటనే ఫోన్ కాల్‌ను కట్ చేయండి.
- పోలీసు అధికారిని అంటూ మీకు ఫోన్ చేసి మీ ఆధార్ నంబరు అడిగితే స్పందించకండి.
- మీరు డిజిటల్ అరెస్టులో ఉన్నారని చెబితే పట్టించుకోవద్దు.
- మీకు వచ్చిన/ మీరు పంపిన ప్యాకేజీలో డ్రగ్స్ కొనుగొన్నట్టు సైబర్ నేరగాళ్లు చెబుతారు. దీనికి మీరు ప్రతిస్పందించవద్దు.
- సైబర్ నేరగాళ్లు వాట్సాప్ లేదా ఎస్ఎంఎస్ ఉపయోగించి మిమ్మల్ని సంప్రదిస్తే ప్రతిస్పందించవద్దు.
- ఎవరైనా మీకు కాల్ చేసి, పొరపాటున మీ యూపీఐ ఐడీకి డబ్బు పంపామని, ఆ డబ్బును తిరిగి ఇవ్వాలని కోరితే పట్టించుకోవద్దు.
- ఎవరైనా మీ కారు/ వాషింగ్ మెషీన్/ సోఫా కొనుగోలు చేయాలనుకుంటున్నామని, సైన్యం లేదా సీఆర్‌పీఎఫ్ నుంచి వచ్చామని చెప్పి, వారి ఐడీ కార్డును మీకు చూపించినా ప్రతిస్పందించవద్దు.
- వీడియో మోడ్‌లో ఎటువంటి కాల్స్‌కు సమాధానం ఇవ్వవద్దు.
- మీకు కాల్ వచ్చిన నంబరు గందరగోళంగా, అనుమానంగా ఉంటే మీ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఆ నంబర్‌ని బ్లాక్ చేయండి.
- నీలం రంగులో వచ్చిన ఏ లింక్‌ను కూడా క్లిక్ చేయకండి
- పోలీసు, సీబీఐ, ఈడీ, ఐటీ వంటి అత్యున్నత విభాగాల నుంచి మీకు నోటీసు వస్తే- ఆఫ్‌లైన్‌లోనే స్పందించండి. ఇటువంటి లేఖలు అధీకృత ప్రభుత్వ పోర్టల్ నుంచి వచ్చాయో లేదో తనిఖీ చేయండి.
- మీ చిరునామా, హోదా, ఫోన్ నంబర్, ఆధార్ నంబర్, పాన్ నంబర్, పుట్టిన తేదీ లేదా ఏదైనా వ్యక్తిగత వివరాలను ఫోన్ లేదా సందేశాల ద్వారా ఎవరితోనూ పంచుకోవద్దు.
- సైబర్ నేరగాళ్లు మీకు కాల్ చేసి మీ పేరు, ఫోన్ నంబరు, మరికొన్ని వివరాలు చెబుతారు. ఇవి వాస్తవం అయినప్పటికీ మీరు వాటిని నిర్ధారించకుండా కాల్‌ను కట్ చేసి, ఆ ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేయండి.
- అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసినప్పుడు కీబోర్డులో ఎటువంటి నంబర్లను నొక్కవద్దు, వాళ్లు చెప్పిన వాటిని వినవద్దు. వెంటనే కాల్ కట్ చేసి, నంబర్ బ్లాక్ చేయండి.
- ఒకవేళ పొరపాటున సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతే.. వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

క్రైం... crime news

పోసానిపై నర్సీపట్నం పోలీసులకు ఫిర్యాదు

నర్సీపట్నం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరపతి దేవస్థానం బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడుపై సినీ నటుడు, వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మరిడయ్య గురువారం నర్సీపట్నం సీఐ గోవిందరావుకు ఫిర్యాదు చేశారు. పోసాని వ్యాఖ్యలు పూర్తిగా వాస్తవ దూరమని, కుట్ర పూరితమని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబునాయుడు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లపై పోసాని ఇటువంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. పోసానిపై కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మరిడయ్య కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

లంకెలపాలెం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. లంకెలపాలెం రైల్వే గేటు వద్ద గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకొంది. దీనికి సంబంధించి దువ్వాడ జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కంచరపాలెం ప్రాంతానికి చెందిన రొక్కం శేషగిరిరావు(50) స్థానిక కూడలిలో గల ఓ హోటల్‌లో పనిచేస్తూ స్థానికంగా నివాసముంటున్నాడు. ఉదయం లంకెలపాలెం నుంచి జాతీయ రహదారి కూడలికి నడిచి వచ్చే క్రమంలో రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ప్రమాద స్థలాన్ని దువ్వాడ జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వృద్ధుడి మృతి



శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం తెల్లవారుజామున అదృశ్యమైన వృద్ధుడు మృతి చెందాడని, దీనిపై గురువారం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక నరసింగరావుపేట దుర్గాలాడ్జి వీధిలో ఉంటున్న అద్దంకి శ్రీనివాసరావు(72) బుధవారం తెల్లవారుజామున అదృశ్యమైన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు గురువారం వెతుకుతుండగా చినబాబుకాలనీలోని జీవీఎంసీ ప్రధాన మంచినీటి సరఫరా కేంద్రం సమీపంలో మృతి చెంది ఉండడాన్ని గుర్తించారని ఎస్ఐ తెలిపారు. ఆయన కుమారుడు రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

అదృశ్యమైన పోస్టల్ ఉద్యోగి మృతి



సత్యప్రవీణ్ (ఫైల్ ఫొటో)

దేవరాపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడిలో బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్న దాసరి సత్య ప్రవీణ్ (28) రైవాడ జలాశయంలో శవమై తేలాడు. తన కుమారుడు కనిపించడం లేదంటూ సత్యప్రవీణ్ తండ్రి లోవరాజు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం రైవాడ జలాశయంలో మృతదేహం తేలినట్టు స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి సత్యప్రవీణ్‌గా నిర్ధారించారు. జలాశయాన్ని చూసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో పడిపోయి మృతిచెంది వుంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



పడాల నరేంద్ర (ఫైల్ ఫొటో)

మాడుగుల రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎం.కోడూరు గ్రామానికి చెందిన పడాల నరేంద్ర (30) బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం.. పడాల నరేంద్ర ఎం.కోడూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో స్నేహితునితో కలిసి బైక్‌పై వీరనారాయణం నుంచి గాదిరాయి వెళుతూ మూత్రవిసర్జన కోసం దారిలో ఆగారు. అక్కడ తెగిపడి వున్న విద్యుత్ తీగను నరేంద్ర గమనించలేదు. చీకటిగా వుండడంతో కరెంటు తీగ కాలికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. నరేంద్ర తల్లి కొండమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.